

# నేటి నిజం

తెలుగు దినపత్రిక



website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 28-12-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:28 | సంచిక:120 | పేజీలు:4 | వెల: రూ.1/-


## ఆరోగ్య తెలంగాణకు కల సాకారం చేద్దాం: హరీశ్

హైదరాబాద్, డిసెంబర్ 27:ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య తెలంగాణ కల సాకారం కోసం అందరం కలిసి కృషి చేద్దామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. కరోనా నుండి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రెండు డోసుల వ్యాక్సిన్ వేసుకోవాలని, కోవిడ్ నిబంధనలు అందరూ తప్పక పాటించాలని సూచించారు. తెలంగాణ ఆయుష్ ఫార్మాసిస్ట్ సెంట్రల్ ఫోరం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ని మంత్రి హరీశ్ రావు సోమవారం కొకాపేట లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు ప్రకాష్ రావు, జనరల్ సెక్రటరీలు జయ ప్రకాష్ రెడ్డి, సుధారాణి, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోహన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## కె రైల్ ప్రాజెక్టు.. కేరళ కాంగ్రెస్ లో ముసలం.. శశిథరూర్ పై ఆగ్రహం..

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కేరళ కాంగ్రెస్ పార్టీలో ముసలం కొనసాగుతోంది. ఆ పార్టీ చీఫ్ సొంత పార్టీ ఎంపీ శశి థరూర్‌కు వార్నింగ్ ఇవ్వడంతో కేరళలో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అనే తీరు నడుస్తోంది. వామపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన కే-రైల్ (కేరళ హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు పిటిషన్ దాఖలే చేశాయి. ఈ పిటిషన్ పై శశి థరూర్ సంతకం చేయకపోవడంపై కేరళ కాంగ్రెస్ నేతలు కినుక వహించారు. దీనిపై అధ్యయనం చేసేందుకు తనకు మరింత సమయం కావాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ చెప్పినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, "పార్టీలో శశిథరూర్ ఒంటరి వ్యక్తి.. ప్రతి వ్యక్తి అభిప్రాయానికి అర్హులే.. పార్టీ శ్రేణులు అంగీకరిస్తేనే కొనసాగుతానని.. వాళ్లు అంగీకరించకుంటే పార్టీలో ఉండను అంతే" అని కాంగ్రెస్ కేరళ యూనిట్ చీఫ్ కె సుధాకరన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ నెల ప్రారంభంలో మిస్టర్ థరూర్ తన పేరును పిటిషన్‌లో ఉంచకూడదని పార్టీ శ్రేణులకు తెలిపారు. "ఎలాంటి అపార్థాలకు ఆస్కారం లేదు. ఈ ప్రాజెక్ట్‌కు నేను ఎటువంటి మద్దతు ఇవ్వలేదు. ఇంత పెద్ద సమస్య వచ్చినప్పుడు, దాని గురించి వివరంగా చర్చించాల్సిన బాధ్యత మనపై ఉంది. అయితే ఇది వ్యతిరేకించడం మాత్రం కాదు" అని డిసెంబర్ 15న పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ విలేకరులతో అన్నారు.

అయితే ఐ -రైల్ సిల్వర్‌లైన్ ప్రాజెక్ట్ హై-స్పీడ్ రైలు కారిడార్‌ను ఏర్పాటు చేయడం లక్ష్యంగా కేరళ ప్రభుత్వం పెట్టుకుంది, ఇది కేరళలోని ఒక చివరనుంచి మరో చివరను కలుపుతుంది. ప్రయాణ సమయాన్ని కూడా బాగా తగ్గిస్తుంది. 532 కిలోమీటర్ల కారిడార్‌కు ?63,941 కోట్లు ఖర్చువుతుంది. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుందని, అధికంగా ఖర్చు పెడుతున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. లెఫ్ట్ ఫ్రంట్ మిత్రపక్షమైన సీపీ కూడా డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును బహిరంగపరచాలని డిమాండ్ చేసింది.

## గుడ్ గవర్నెన్స్ ర్యాంకుల్లో తెలంగాణ.. రెండు విభాగాల్లో నెంబర్ వన్..

హైదరాబాద్, డిసెంబర్ 27:2020-21 సంవత్సరానికి కేంద్రం వెలువరించిన గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం రెండు అవార్డులతో మెరిసింది. పారిశ్రామికీకరణ, వాణిజ్యం, సోషల్ వెల్ఫేరర్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇందుకు ఇక్కడి పరిశ్రమల అభివృద్ధి, స్టార్టప్ ఎకో సిస్టం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ)లో మెరుగైన స్థానం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పని తీరు అంశాల ఆధారంగా పరిశ్రమల విభాగంలో మొదటి ర్యాంకును తఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత, నిరుద్యోగ రేటు, హౌజింగ్ ఫర్ ఆల్, లింగ సమానత్వం, ఎకానమిక్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ వుమెన్ సూచీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచినందుకు సోషల్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కేటగిరీలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వాల పాలనలోని పది రంగాలకుగానూ 58 సూచీలతో అంచనా వేసి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఈ ర్యాంకులను కేటాయిస్తోంది.

## ప్రతిపక్షాలకు పబ్లిసిటీ పిచ్చి బాగా ముదిరింది: తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 27:రాష్ట్రంలో ప్రతిపక్షాలకు పబ్లిసిటీ పిచ్చి బాగా పెరిగిందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బిజేపీ పార్టీలు కేవలం సీఎం కేసీఆర్ ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని ఆరోపించారు. సోమవారం మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్ తో కలిసి టీఆర్ఎస్ ఎల్పీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.గతంలో తెలంగాణ లో రైతుల ఆత్మహత్యలు ఉండేవి. కరెంటు సమస్య ఉండేది.అసెంబ్లీ సమావేశాల్లో ఇవే అంశాలు ప్రధానంగా ఉండేవి. కానీ ఇప్పుడు రాష్ట్రంలో మచ్చుకైనా అలాంటి సీన్ లు కనిపించడం లేదన్నారు



ఏ రాష్ట్రం లో తెలంగాణ లాగా వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఉచితంగా ఇస్తున్నారో ప్రతిపక్షాలు చెప్పగలవా? నేను ఛాలెంజ్ చేస్తున్నా,సాగునీరు తాగు నీరు కు అల్లాడిన తెలంగాణ ను తన చతురత తో అగ్ర భాగాన నిలబెట్టింది కేసీఆర్ కాదా? రైతులకు ఇస్తున్న సదుపాయాల కారణంగా పంట దిగుబడులు భారీ గా పెరిగాయి.ఆహార భద్రత చట్టం ప్రకారం ధాన్యం సేకరణ కేంద్రం బాధ్యత. అది మరిచి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలంగాణ రైతాంగాన్ని అవమాన పరిచిన తీరు బాధాకరమని ఆయన అన్నారు.తెలంగాణ బీజేపీ నేతలకు పీయూష్ వాస్తవాలు చెప్పరా? వాళ్ల ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు.

యూపీ ఎన్నికల్లో ఒడిపోతామని తెలిసే సాగు చట్టాలు ఉపసంహరించుకున్నారని ఎద్దేవా చేశారు. మళ్లీ సాగు చట్టాలు తెస్తామని మరో కేంద్ర మంత్రి చెబుతున్నారు.బీజేపీలో ఒక్కో నాయకుడి తీరు ఒక్కో రకంగా ఉంది.మరొకడు వరి ఖచ్చితంగా వేయాలని చెబుతుంటాడు.నిరుద్యోగ దీక్ష పేరిట బీజేపీ డ్రామా ఆడుతోందన్నారు. దమ్ముంటే కేంద్ర ఉద్యోగాల పై శ్వేత పత్రం ప్రకటించాలిమంత్రి తలసాని డిమాండ్ చేశారు. బీజేపీ మేనిఫెస్టో లో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామంది. ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో తెలంగాణ కు అవార్డులు ప్రకటిస్తున్న సంగతి బీజేపీ మూర్ఖులకు తెలియదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఊక దంపుడు ఉపన్యాసాలు తప్ప ప్రతిపక్షాలకు ఏం చేతకాదని,నోరుంది కదా అని మాట్లాడితే ప్రజలు సరైన రీతిలో బుద్ది చెబుతారని హెచ్చరించారు.బీజేపీ ఇంచార్జి తరుణ్ చుగ్ కు పంజాబ్ లోనే దిక్కు లేదు.ఇక్కడొచ్చి ఏదో చేస్తానని మాట్లాడుతున్నారని అన్నారు.తెలంగాణ కు మేలు చేయడమే టీఆర్ఎస్ పని.బాధ్యతాయుత పదవి లో ఉండి రేవంత్ రెడ్డి అసభ్య పద జాలం వాడుతున్నారు.జోగి జోగి రాసుకుంటే బూడిద రాలినట్లు గా ఉంటుంది బండి సంజయ్, రేవంత్ ల తీరు.తెలంగాణ కన్నా వేరే రాష్ట్రాల్లో పథకాలు బాగా అమలు జరుగుతున్నాయని కాంగ్రెస్ బీజేపీ లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంత్రి తలసాని సవాల్ విసిరారు.

## ఆ రాష్ట్రాల్లో వ్యాక్సినేషన్ ముమ్మరం చేయండి...కేంద్రానికి తెలిపిన ఈసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:వచ్చే ఏడాది ప్రథమార్థంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాల్లో కోవిడ్ వ్యాక్సినేషన్‌ను ముమ్మరం చేయాలని కేంద్రానికి భారత ఎన్నికల సంఘం సోమవారంనాడు తెలిపింది. కోవిడ్ కొత్త వేరియంట్ ఒమైక్రాన్‌తో సహా కోవిడ్ కొత్త కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈసీ ఈ సూచనలిచ్చింది. ఎన్నికలకు సిద్ధమవుతున్న ఐదు రాష్ట్రాల్లో పరిస్థితిపై ఇప్పటికే కేంద్రాన్ని ఈసీ నివేదిక కోరింది..

వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న 5 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా ఉన్నాయి. ఉత్తరాఖండ్, గోవాల్లో అర్హులైన 100 శాతం జనాభాకు వ్యాక్సిన్ తొలి డోసు ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో 85 శాతానికి తొలి డోసు ఇవ్వగా, మణిపూర్, పంజాబ్‌లో ఇది 80 శాతం కంటే తక్కువగా ఉంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ డాటాను ఎన్నికల కమిషన్‌కు అందజేసింది.

మరోవైపు, కోవిడ్ కేసుల పెరుగుదల ఒమైక్రాన్ వేరియంట్ ముప్పు మధ్య అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న ఐదు రాష్ట్రాల్లో ర్యాలీల నిర్వహణపై భయాందోళనలు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఎన్నికలు జరగనున్న కొన్ని రాష్ట్రాలతో ముడిపడిన అంతర్జాతీయ సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన సూచనలిచ్చింది. ఆరోగ్య కార్యదర్శి రాజేష్ భూషణ్ సైతం ఎన్నికల కమిషన్‌ను కలిసి దేశంలోని కోవిడ్ పరిస్థితిని వివరించారు. కాగా, ఎన్నికల సంసిద్ధతను సమీక్షించేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఆయన సహచర ఎన్నికల కమిషనర్లు మంగళవారంనాడు ఉత్తరప్రదేశ్‌లో పర్యటించనున్నారు

## గుజరాత్‌కు గులాంగా బీజేపీ నేతలు మారారు: బాల్క సుమన్

హైదరాబాద్, డిసెంబర్ 27:గుజరాత్‌కు గులాంగా తెలంగాణ బీజేపీ నేతలు మారారని విప్ బాల్క సుమన్ మండిపడ్డారు. రైతుల అంశం ప్రశ్నిస్తామనే ఉద్యోగాల పేరుతో కొత్త డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తెలంగాణకు అన్ని రంగాల్లో అన్యాయం చేస్తోందన్నారు. యువత బీజేపీ చేసే విషప్రచారం ట్రాప్‌లో పడొద్దన్నారు.

## కొంతమంది పార్టీని నాశనం చేద్దామని చూశారు: తుమ్మల

అశ్వారావుపేట, డిసెంబర్ 27:: రాజకీయాల్లో ఉన్నంత వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గాభివృద్ధి చేసే బాధ్యత తనదని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో ఎమ్మెల్సీ తాత మధు అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.."కొంతమంది రాజకీయ నాయకులు కుట్రలు పన్నీ పార్టీని నాశనం చేద్దామని చూశారు. అయినా మీ అందరూ పార్టీ పరువు పోకుండా ఎమ్మెల్సీ తాత మధుని గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. నేను మంత్రిగా ఉన్నప్పుడు నాకు అవకాశం వచ్చిన సందర్భంలో అశ్వారావుపేట అభివృద్ధి విషయంలో ప్రతి గ్రామానికి లింక్ రోడ్లు వేశా. భారతదేశంలో ఫామ్ ఆయిల్ హబ్‌గా అశ్వారావుపేట దమ్మపేట మండలాలు ఉండబోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అశ్వారావుపేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎక్కడ జరగలేదు. నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన అశ్వారావుపేట సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా. భవిష్యత్‌లో కూడా అందరం కలిసి ప్రయాణం చేయాలి" అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## మరోసారి లాక్‌డౌన్ తప్పదా..?

బెంగళూరు, డిసెంబర్ 27:: రాష్ట్రంలో ఒక్కసారిగా పదిరోజుల నైట్‌కర్ఫ్యూ విధించడం లాక్‌డౌన్‌కు సంకేతమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇరవై నెలలుగా ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా వైరస్ కొత్తవేరియంట్ ఒమైక్రాన్‌గా రెండునెలల వ్యవధిలోనే పలు దేశాలలో భారీగా విస్తరించింది. దక్షిణాఫ్రికాలో ప్రారంభమైన వైరస్ ఇప్పటికే పదుల సంఖ్య దేశాలను అతలాకుతలం చేస్తోంది. ఒమైక్రాన్ ప్రభావం ఎలా ఉంటుందనేది ఇంకా పరిశోధనల దశలోనే ఉండడం... దేశవ్యాప్తంగా రోజూ కేసులు పెరుగుతుండటంతో కేంద్రం అప్రమత్తమైంది. వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ప్రస్తుతానికి రాష్ట్రంలో కొవిడ్ కేసులు భారీగా పెరగనప్పటికీ ఒమైక్రాన్ ఎటువంటి పరిణామాలు చూపనుందోనని ముందుగా 10 రోజుల నైట్‌కర్ఫ్యూను ప్రకటించారు. మంగళవారం నుంచి జనవరి మొదటివారం దాకా నిబంధనలు అమలులో ఉంటాయి. దేశంలో తొలి ఒమైక్రాన్ కేసులు కర్ణాటక రాజధాని బెంగళూరులోనూ వెలుగు చూశాయి. దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన వ్యక్తితో పాటు బెంగళూరుకు చెందిన ఓ డాక్టర్‌కు నిర్ధారణ అయింది. ఆ తర్వాత రాష్ట్రంలో కేసుల పరంపర సాగుతూనే ఉంది. శుక్రవారం దాకా 31 మందికి ఒమైక్రాన్ వైరస్ ప్రబలగా శనివారం ఒక్కసారిగా 8 మందికి సోకింది. వీరిలో ఇద్దరు కతార్ నుంచి వచ్చినవారు కాగా మిగిలిన ఆరుగురు లండన్ నుంచి వచ్చినవారే. ఎయిర్ పోర్టులోనే వీరికి పాజిటివ్ నిర్ధారణ కాగా జినోమి సీక్వెన్సీకి పంపగా పాజిటివ్‌గా తేలింది. ఇలా రాష్ట్రంలో ఒమైక్రాన్ బాధితులు 39 మంది అయ్యారు. వీరిలో దాదాపు 15 మందికి పైగా కోలుకున్నవారే ఉన్నట్లు సమాచారం. శాసనసభ సమావేశాలు శుక్రవారం దాకా బెళగావిలో జరిగాయి. అప్పటి దాకా రాష్ట్రంలో ఎటువంటి నిబంధనలు పాటించాలనే నిర్ణయం తీసుకోలేదు. కానీ క్రిస్మస్, కొత్తసంవత్సర వేడుకలకు మాత్రమే ఆంక్షలు పెట్టారు. ఒక్కరోజులోనే పూర్తిగా నిబంధనలు మార్చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై అధికారులతో సమీక్ష నిర్వహించి ఆంక్షల అమలుకు సిద్ధమయ్యారు. రాత్రి కర్ఫ్యూ అమలులోకి తీసుకురావడంతో పాటు సభలు, సమావేశాలు, వివాహాలకు ఇప్పటి దాకా ఉండే 500 మంది నుంచి 300 మందికి తగ్గించారు. రాత్రి కర్ఫ్యూ అమలులోకి రావడంతో మరో రెండు రోజుల తర్వాత ఎటువంటి మార్పులు వస్తాయో అనే భయం ప్రజలలో వెంటాడుతోంది. విద్యాసంస్థలపై ప్రభావం చూపనుందా అనేది కూడా హాట్‌టాపిక్‌గా మారింది. గడిచిన 20 నెలల వ్యవధిలో రెండు విడతల కొవిడ్ కాలంలోను భారీ ఆంక్షలు అమలు చేసేందుకు ముందు నైట్‌కర్ఫ్యూతోనే ప్రజలను చైతన్యపరుస్తూ వచ్చారు. కొన్ని దేశాలలో రోజూ వేలకు వేల ఒమైక్రాన్ కేసులు నమోదవుతుండటంతో అటువంటి పరిస్థితి కర్ణాటకలో మరెంతో కాలంలో లేదని జనవరి ఆఖరు లేదా ఫిబ్రవరి నాటికి వేలకు వేలు కేసులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## 'హిమాచల్ ప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్' యొక్క రెండో గ్రౌండ్ బ్రేకింగ్ సెరిమనికి అధ్యక్షత వహించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న హిమాచల్ ప్రదేశ్ లోని మండీ లో జరిగిన 'హిమాచల్ ప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్' తాలూకు రెండో గ్రౌండ్ బ్రేకింగ్ సెరిమని కి అధ్యక్షత వహించారు. దాదాపు 28,000 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల ద్వారా ఆ ప్రాంతం లో పెట్టుబడి కి ఈ సదస్సు ఒక దన్ను గా నిలుస్తుందన్న అంచనా ఉంది. ప్రధాన మంత్రి 11,000 కోట్ల రూపాయల కు పైగా విలువ గల జల విద్యుత్తు పథకాల ను కూడా ప్రారంభించి, ఆ తరహా పథకాలు మరికొన్నిటికి శంకుస్థాపన చేశారు. జల విద్యుత్తు పథకాల లో కొన్ని ఏవేవంటే అవి రేణుకాజీ ఆనకట్ట పథకం, లుహ్ రీ ఒకటో దశ జల విద్యుత్తు పథకం, ధౌలాసిధ్ జల విద్యుత్ పథకం. ఆయన సావ్ రా- కుడ్ డూ జల విద్యుత్తు పథకాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భం లో పాలుపంచుకొన్న వారి లో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శ్రీ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ జయ్ రామ్ ఠాకుర్, కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ సింహ్ ఠాకుర్ లు ఉన్నారు.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, హిమాచల్ ప్రదేశ్ తో తనకు ఉన్నటువంటి భావోద్వేగభరిత బంధాన్ని గుర్తు కు తెచ్చుకున్నారు. ఆ రాష్ట్రం లోని పర్వతాలు తన జీవనం లో ఒక ప్రధానమైనటువంటి పాత్ర ను పోషించాయి అని ఆయన అన్నారు. నాలుగు సంవత్సరాల పాటు జోడు ఇంజిన్ ల ప్రభుత్వానికిగాను హిమాచల్ ప్రదేశ్ ప్రజల కు ఆయన అభినందనల ను కూడా తెలియ జేశారు. ఈ నాలుగేళ్ళ లో రాష్ట్రం మహమ్మారి సవాలు ను ఎదుర్కొని, అలాగే అభివృద్ధి తాలూకు శిఖరాల ను కూడా అధిరోహించింది అని ప్రధాన మంత్రి అన్నారు. "జయ్ రామ్ గారు మరియు ఆయన నేతృత్వం లో కష్టించి పనిచేసిన బృందం హిమాచల్ ప్రదేశ్ ప్రజల కలల ను పండించడం కోసం ఏ ఒక్క అవకాశాన్ని అయినా విడిచిపెట్టలేదు" అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు.

దేశం లోని ప్రజల కు 'జీవించడం లో సౌలభ్యం' కల్పన అనేది అగ్ర ప్రాథమ్యాల లో ఒకటి గా ఉంది మరి దీని ని నెరవేర్చడం లో విద్యుత్తు ఒక పెద్ద పాత్ర ను పోషిస్తుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ రోజు న ప్రారంభించినటువంటి జల విద్యుత్తు పథకాలు పర్యావరణ మిత్ర పూర్వకమైన అభివృద్ధి పట్ల భారతదేశం యొక్క వచన బద్ధత కు అద్దం పడుతున్నాయి అని ఆయన అన్నారు. "గిరి నది మీది శ్రీ రేణుకాజీ ఆనకట్ట ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయింది అంటే, దాని వల్ల ఒక విశాల ప్రాంతం ప్రత్యక్ష ప్రయోజనాన్ని పొందుతుంది. ఈ ప్రాజెక్టు నుంచి అందే ఏ ఆదాయం లో అయినా సరే అందులోని ఒక పెద్ద భాగాన్ని కూడా ఇక్కడి అభివృద్ధి కై వెచ్చించడం జరుగుతుంది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు.

'న్యూ ఇండియా' పని తీరు మారింది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. భారతదేశం తన పర్యావరణ సంబంధి లక్ష్యాల ను నెరవేర్చుకొంటున్న వేగాన్ని గురించి ఆయన మాట్లాడారు. "2016వ సంవత్సరం లో, భారతదేశం తన స్థాపిత విద్యుత్తు సామర్థ్యం లో 40 శాతాన్ని 2030వ సంవత్సరానికల్లా శిలాజేతర శక్తి వనరుల నుంచి సమకూర్చుకోవాలనే లక్ష్యాన్ని పెట్టుకొంది. ఈ లక్ష్యాన్ని భారతదేశం ఈ ఏడాది నవంబర్ లోనే సాధించింది అనే విషయం పట్ల భారతదేశం లోని ప్రతి ఒక్కరు ప్రస్తుతం గర్వించాలి" అని ప్రధాన మంత్రి అన్నారు. "పర్యావరణాన్ని కాపాడుతూనే భారతదేశం ఏ విధం గా అభివృద్ధి ని వేగిరపరచుకొంటున్నదీ గమనించి యావత్తు ప్రపంచం భారతదేశాన్ని మెచ్చుకొంటున్నది. సౌర విద్యుత్తు మొదలుకొని జల విద్యుత్తు వరకు, పవన విద్యుత్తు మొదలుకొని గ్రీన్ హైడ్రోజన్ వరకు నవీకరణ యోగ్య శక్తి తాలూకు ప్రతి ఒక్క వనరు ను పూర్తి స్థాయి లో వినియోగించుకోవడాని కి దేశం అదే పని గా పాటుపడుతోంది" అని ప్రధాన మంత్రి తెలిపారు.

ప్లాస్టిక్ ను ఒకసారి ఉపయోగించిన తరువాత వదలివేయాలి అనే తన ఆలోచన ను గురించి ప్రధాన మంత్రి మరోమారు వెల్లడించారు. ప్లాస్టిక్ వల్ల పర్వతాల కు వాటిల్లిన నష్టం విషయం లో ప్రభుత్వం అప్రమత్తం గా ఉంది అని ఆయన చెప్పారు. ఒకసారి వినియోగించవలసిన ప్లాస్టిక్ పట్ల దేశవ్యాప్త ప్రచార ఉద్యమాన్ని నడపడం తో పాటుగా ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ అంశం పైన సైతం కృషి చేస్తోంది. మనిషి ప్రవర్తన లో మార్పు రావలసిన అవసరాన్ని గురించి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావిస్తూ, "హిమాచల్ ను స్వచ్ఛం గాను, ప్లాస్టిక్ కు మరియు ఇతర వ్యర్థ పదార్థాల కు తావు ఉండనటువంటివి గాను అట్టిపెట్టడం లో పర్యటకుల కు కూడా ఒక ప్రధాన బాధ్యత ఉంది. ప్లాస్టిక్ అన్ని చోట్ల కు వ్యాపించింది. ప్లాస్టిక్ నదుల లోకి వెళ్తోంది. అది హిమాచల్ కు కలుగజేస్తున్న నష్టాన్ని అడ్డుకోవడం కోసం మనమంతా కలసి తప్పక పాటుపడాలి" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

హిమాచల్ ప్రదేశ్ లో ఔషధ నిర్మాణ రంగం యొక్క వృద్ధి ని ప్రధాన మంత్రి మెచ్చుకొన్నారు. "భారతదేశం ప్రస్తుతం ప్రపంచ ఔషధాలయం అనే పేరు ను తెచ్చుకొందీ అంటే దాని వెనుక ఉన్న శక్తి హిమాచల్. హిమాచల్ ప్రదేశ్ కరోనా విశ్వమారి కాలం లో ఇతర రాష్ట్రాల కు సాయపడటం ఒక్కటే కాకుండా ఇతర దేశాల కు కూడాను సాయం చేసింది" అని ఆయన అన్నారు.

రాష్ట్రం కనబరచిన గొప్ప పని తీరు ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, "హిమాచల్ తన యావత్తు వయోజనుల కు టీకామందు ను అందించడం లో ఇతర రాష్ట్రాల కంటే ఉజ్జ్వలం గా ప్రకాశించింది. ఇక్కడ ప్రభుత్వం లో ఉన్న వారు రాజకీయ స్వార్థపరత్వం లో మునిగిపోలేదు. అంతకంటే వారు వారి పూర్తి దృష్టి ని హిమాచల్ లోని ప్రతి ఒక్క పౌరుడులపౌరురాలు ఏ విధం గా వ్యాక్సీన్ ను పొందగలరు అనే అంశం పైనే నిలిపారు" అని ఆయన అన్నారు.

అమ్మాయిలకు వివాహ వయస్సు ను మార్చడాని కి ప్రభుత్వం ఇటీవల తీసుకొన్న నిర్ణయాన్ని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. "కుమారుల ను వివాహానికి అనుమతించే వయస్సు తో సమానం గా కుమార్తె ల వివాహ వయస్సు కూడా ఉండాలి అని మేం నిర్ణయించాం. కుమార్తెల కు వివాహ యుక్త ప్రాయాన్ని 21 సంవత్సరాల కు పెంచడం అనేది వారికి చదువుకోవడానికి పూర్తి కాలాన్ని ప్రసాదిస్తుంది. మరి వారు వారి యొక్క ఉద్యోగ జీవనాన్ని కూడా తీర్చిదిద్దుకోగలుగుతారు" అని ప్రధాన మంత్రి అన్నారు.

కొత్త వాక్సీనేశన్ కేటగిరీ ల విషయం లో ఇటీవల ప్రకటనల ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడారు. ప్రతి ఒక్క అవసరాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రభుత్వం అత్యంత సూక్ష్మ గ్రాహ్యత తో, జాగ్రత తో పని చేస్తోంది అని ఆయన అన్నారు. 15 ఏళ్ళ నుంచి 18 ఏళ్ళ మధ్య వయస్సు కలిగిన వారి కి సైతం రాబోయే జనవరి 3వ తేదీ నుంచి టీకామందు ను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

గడచిన రెండు సంవత్సరాల లో కరోనా కు వ్యతిరేకం గా జరుగుతూ ఉన్న యుద్ధం లో మన ఆరోగ్య రంగ సిబ్బంది, ఫ్రంట్ లైన్ వర్కర్ లు దేశాని కి బలం గా నిలచారు అని ప్రధాన మంత్రి అన్నారు. వారికి ప్రికాశన్ డోజు ను ఇచ్చే ప్రక్రియ కూడా రాబోయే జనవరి 10వ తేదీ నుంచి మొదలవుతుంది. 60 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు ఇదివరకే గంభీరమైన వ్యాధుల బారిన పడి ఉన్నట్లయితే వారికి కూడా వైద్యుల సలహా ప్రకారం ప్రికాశన్ డోసేజీ తాలూకు ఐచ్ఛికాన్ని ఇవ్వడం జరుగుతుంది అని ప్రధాన మంత్రి తెలిపారు.

'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, ఇంకా సబ్ కా ప్రయాస్' మంత్రం స్ఫూర్తి తో కృషి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ప్రధాన మంత్రి చెప్పారు. "ప్రతి దేశాని కి వేరు వేరు ఆదర్శవాదాలంటూ ఉంటాయి. కానీ ప్రస్తుతం మన దేశ ప్రజలు రెండు విధాలైన ఆలోచనవిధానాల ను స్పష్టం గా గమనిస్తున్నారు. ఒక ఆలోచన విధానం జాప్యాని కి సంబంధించింది. మరొక ఆలోచన విధానం అభివృద్ధి కి సంబంధించింది. జాప్యం చేయడం అనే ఆలోచన విధానం కలిగిన వారు పర్వత ప్రాంతాల లో ప్రజల పట్ల ఎన్నడూ శ్రద్ధ వహించ నేలేదు" అని ఆయన అన్నారు. జాప్యాని కి తావునిచ్చే ఆలోచన విధానం హిమాచల్ ప్రదేశ్ ప్రజల ను దశాబ్దుల పాటు నిరీక్షణ కు గురి చేసింది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ కారణం గా అటల్ సొరంగ మార్గం నిర్మాణం లో అనేక సంవత్సరాల ఆలస్యం జరిగింది. రేణుక ప్రాజెక్టు కూడా మూడు దశాబ్దాల పాటు ఆలస్యం అయింది. ప్రభుత్వం నిబద్ధతల్లా అభివృద్ధే అని ఆయన నొక్కి చెప్పారు. అటల్ సొరంగ మార్గం పని పూర్తి అయింది. మరి చండీగఢ్ నుంచి మనాలీ ని మరియు శిమ్ లా ను కలిపే రహదారి ని కూడా విస్తరించడం జరిగింది అని ఆయన వివరించారు.

హిమాచల్ ఒక పెద్ద సంఖ్య లో రక్షణ సిబ్బంది కి పుట్టినిల్లుగా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. రక్షణ సిబ్బంది కి, ఆ రంగం లో ఇది వరకు పని చేసిన వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొన్న చర్యల ను గురించి ఆయన వివరించారు. "హిమాచల్ ప్రదేశ్ లో ప్రతి ఒక్క కుటుంబం లోను దేశాన్ని కాపాడే ధైర్యవంతులైన కుమారులు, కుమార్తెలు ఉన్నారు . దేశ భద్రత ను పెంచడం కోసం గత ఏడేళ్ళ లో మా ప్రభుత్వం చేసిన కార్యాలు, సిపాయిలు, మాజీ సైనికోద్యోగుల కోసం తీసుకొన్న నిర్ణయాలు సైతం హిమాచల్ ప్రజల కు గొప్ప ప్రయోజనాల ను అందించాయి" అని చెప్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ డాబును దర్పము నెరుగని
ప్రాబల్యము కోరుకొనని వరగుణుడుగ "ధీ
రూబాయుంబాని" కాసగె
నా బల రామాను జుడు మహాబల యశముల్!!



(డిసెంబర్ 28 ధీమారూబాయ్ అంబాని జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శీతాకాల విడిది రద్దు

హైదరాబాద్, డిసెంబర్ 27:రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శీతాకాల విడిది రద్దు అయ్యింది. ఈ మేరకు ఢిల్లీ రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి. ప్రతి ఏడాది సంప్రదాయం ప్రకారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వస్తుంటారు. ఈ క్రమంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేసేందుకు ఆయన డిసెంబర్ చివరి వారంలో రానున్నారని రాష్ట్రపతి భవన్ ఇటీవల తెలిపింది. అయితే, రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శీతాకాల విడిది రద్దు అయ్యినట్లు తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్రపతి భవన్ సమాచారం అందించింది.షెడ్యూల్ ప్రకారం ఈనెల 29 నుంచి జనవరి 3వరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హైదరాబాద్ రావల్సి ఉంది. దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి కేసు పెరుగుతుండటం, కొత్తగా ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో వాయిదా పడ్డట్టు సమాచారం. మరోవైవైపు రాష్ట్రపతి రాక సందర్భంగా బొల్లారంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ప్రోటోకాల్ విభాగం చేపట్టింది. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆక్టోపస్ పోలీసులు రాష్ట్రపతి నిలయంలో మాక్ డ్రిల్ చేపట్టారు.

## కొవిడ్‌పై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి, డిసెంబర్ 27:: ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్ చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొవిడ్‌పై సీఎం సమీక్ష ఏర్పాటు సంద్భంగా సీఎం మాట్లాడారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఏపీలో 6 ఒమైక్రాన్ కేసులు ఉన్నాయని అధికారులు తెలిపారని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖలో జనరల్ బదిలీలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కొత్త రిక్రూట్‌మెంట్లను కూడా పూర్తిచేయాలని ఆదేశించారు.

# కాశీ విశ్వనాథుడి ప్రియ భక్తుడు నరేంద్రుడే?!

అయోధ్య రామమందిర పునర్నిర్మాణం, భద్రీనాథ్ మందిర సుందరీకరణ, అంతరిక్ష క్షిపణుల ప్రయోగ లక్ష్యాల సాధన, 370 ఆర్టికల్ రద్దు, జమ్ము కశ్మీర్ రాష్ట్ర విభజన, లడక్ కేంద్రపాలిత ప్రాంత అభివృద్ధి, స్వచ్ఛ భారత్ ప్రజారోగ్య పరిరక్షణ ఉద్యమం, చైనాకు ధీటైన సైనిక వ్యూహ సమాధానాలు, ట్రిపుల్ తలాక్ రద్దు చట్టం, సాంస్కృతిక పునరుజ్జీవనం వంటి పలు సఫల పథకాలను సుసాధ్యం చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వ మోఘో సంపదలలోంచి మరో జాతి గర్వించదగిన పుణ్యక్షేత్రం కాశీ విశ్వనాథుడు కొలువైన వారణాసి అభివృద్ధికి చేపట్టిన బృహత్తర 'కాశీ విశ్వనాథ కారిడార్'గా గుండెల నిండుగా చెప్పుకోవచ్చు. ఇలాంటి ప్రజాహిత పథకాల అమలుతో పాటుగా బేటీ బచావో-బేటీ పడావో, జన్ ధన్ యోజన, (గ్రామీణులందరికీ విద్యుత్/నీటి సౌకర్యం, మేక్ ఇన్ ఇండియా, నమామి గంగా, అతి శీఘ్ర ఆర్థిక పురోగతి, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవే, 10 కోట్ల రైతులకు ఏట ఎకరాకు రూ:6,000/- నగదు పంపిణీ, పారదర్శక పాలన, గతిశక్తి మాస్టర్ ప్లాన్, ఆత్మ నిర్భర భారతం, శాస్త్ర సాంకేతిక పురోగతి, కోవిడ్-19 టీకాల రూపకల్పన, స్నేహపూర్వక విదేశాంగ విధానం, మహిళల పెళ్లి వయస్సు 21 ఏండ్లకు పెంచడం, క్వాడ్ సమిట్ నిర్వహణ, సర్జికల్/బాలకోట్ స్ట్రైక్, 2070 నాటికి జీరో కార్బన్ ఉద్గారాల భారత నిర్మాణం, అంకుర సంస్థలకు చేయూత, మహిళా సాధికారత లాంటి అసాధారణ కార్యాలను అతి తేలికగా సుసాధ్యం చేయగలిగిన ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో మరో అద్భుతంగా 'వారణాసి' క్షేత్ర నగర అనిర్వచనీయ అభివృద్ధి పనులను పేర్కొనవచ్చు. పౌరాయి పాలనలో నలిగిన భారత ఆత్మవిశ్వాసాన్ని జాగృత పరిచి, దేశ ప్రజల్లో జాతీయతాభావనను నింపి, భరతమాత సుస్థిరాభివృద్ధికి పూనుకున్న మోదీ దృఢ సంకల్పాన్ని చూసి నరేంద్రనాథ్ లేదా వివేకానందుడు ఆనందిస్తుండవచ్చు.

డిసెంబర్ 13, 2021 పుణ్య తిథిలో 'కాశీ విశ్వనాథ కారిడార్'ను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ గంగా నది తీరాన 241-ఏళ్ళ కాశీ విశ్వనాథుని గుడికి పూర్వవైభవం తేవడం హిందూ సమాజాన్ని దైవ భక్తి సంద్రంలో ముంచేసింది. చిన్న చిన్న సందులను ఛేదిస్తూ గుడిలోని విశ్వనాథుని దర్శించుకున్న పరమ భక్తులకు నేడు సువిశాల ఆలయ ప్రాంగణం స్వాగతం పలకడం అనిర్వచనీయ అనుభూతి. 'విరాసత్(వారసత్వం)', 'వికాస్(అభివృద్ధి)' మేలు కలయికగా ఆలయ నగరాన్ని అద్వితీయంగా తీర్చిదిద్దడం అభినందనీయం. ముస్లిమ్ ఢిల్లీ సుల్తాన్ ఔరంగజేబ్ పాలనలో 1669లో ధ్వంసం కావడం, ఆ స్థానంలో రజియా సుల్తాన్ మసీదు నిర్మింపబడడం జరిగిందని, తరువాత 111 ఏండ్ల వరకు కాశీ మందిరంలో పూజలు జరగలేదని చరిత్రకారులు వివరిస్తున్నారు. 1700లో సవాయ్ జయ్ సింగ్-2 నిర్మించిన ఆది విశ్వేశ్వర మందిరం, 1780లో మరాఠా వీరనారి అహల్యాబాయ్ హోల్కర్ నిర్మించిన ప్రస్తుత విశ్వనాథ మందిరంలో స్వామి నిత్య పూజలు అందుకుంటున్నారని తెలుస్తున్నది. 1841లో కాశీ గుడి గోపురానికి నాగపూర్ భోంస్లే రాజా సౌజన్యంతో వెండి తాపడం, 1835లో పంజాబ్ మహారాజ రంజిత్ సింగ్ చొరవతో ఒక టన్ను బంగారంతో గోపుర డోమ్ నిర్మాణం చేయబడింది. 1828లో గ్వాలియర్ బైజాభాయ్ సింధియ నేతృత్వంలో జ్ఞానవపి గుడి నిర్మాణం జరగడంతో శైవ క్షేత్రం మహిమాన్విత మందిరంగా నిత్య పూజల శోభలతో, భక్తుల రద్దీతో అలరారుతున్నది.

ఆధునిక హంగులను అద్దుకుంటున్న పురాతన సువాసనలు కలిగిన బెనారస్ నగరం దేశ విదేశీ భక్తుల ముఖ్య గమ్యస్థానం కావడం చూస్తున్నాం. భక్తులకు గర్వకారణమైన కాశీ క్షేత్రం అనాదిగా అందరి ఆకాంక్షల మేరకు నేడు 'కాశీ విశ్వనాథ కారిడార్'గా పునర్ వైభవాన్ని సంతరించుకుంటున్నది. అనాదిగా కాశీ విశ్వనాథుడి భక్తులలో ఉన్న అసంతృప్తులను నేడు సరైన, సుందరమైన, భక్తిపూర్వకమైన సమాధానాలు కళ్ల ముందు విందులు చేస్తున్నాయి. కాశీ విశ్వనాథ కారిడార్‌లో భాగంగా తొలి దశలో రూ: 339 కోట్లను వెచ్చించి శ్రీ కాశీ విశ్వనాథ ధామ్ ప్రాజెక్టును చేపట్టారు. దేవాలయం నుంచి గంగా నది తీరం వరకు మార్గాన్ని సువిశాలంగా, సుందరంగా తీర్చిదిద్దారు. వినాశనం కానిదే కాశీ క్షేత్రమని, వారణాసిలో నూతన చరిత్ర ప్రారంభమైందని మోదీ అనడం సబబుగా ఉంది. 'కాశీ కె కోత్వాల్'గా ప్రియంగా పిలుచుకునే నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలయ నగరాన్ని అపూర్వ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా రూపుదిద్దడం మె?దలైంది.

2019లో శంకుస్థాపన చేయబడిన కాశీ విశ్వనాథ కారిడార్ నిర్మాణానికి రూ: 800 కోట్ల నగదును కేటాయించారు. తొలి దశలో భాగంగా రూ: 339 కోట్లను వెచ్చించి, 300 వ్యక్తుల నుంచి స్థలాలను సేకరించడం, 1,400 దుకాణ దారులకు పునరావాసం కల్పించడం జరిగింది. నిన్నటి 3,000 చదరపు అడుగుల మందిరాన్ని నేడు 5 లక్షల చదరపు అడుగుల వరకు పెంచడంతో ఆలయ ప్రాంగణంలో నేడు 75,000 వరకు భక్తులు ఒకేసారి ఉండగల సదవకాశంతో పాటు 23 ఇతర భవనాలను నిర్మించారు. వారణాసిలోని విశ్వనాథ మందిరంతో పాటు గంగా నది తీర స్నానఘట్టాల వెంబడి భక్తులు సులభంగా దర్శించుకునే వెసులుబాటు కలిగింది. కారిడార్ పనుల ప్రగతి సమయంలో 40 పురాతన ఇతర మందిరాలు కూడా బయట పడ్డాయి. ప్రస్తుతం గుడి నుండి గంగా తీరం వరకు 20 ఫీట్ల మార్గం నిర్మించబడింది. నేడు గంగా తీరం నుంచి కాశీ విశ్వనాథుడి మందిరాన్ని కనులారా చూసే భాగ్యం శివ భక్తులకు కలుగుతున్నది. నేడు గంగా నది వెంట 84 వరకు స్నాన ఘట్టాలు భక్తుల శివ నామ స్మరణలతో నిండి ఉంటున్నాయి. కరోనా 2వ అలను సమర్థవంతంగా ఎదుర్కోలేదని, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఓటమి, వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవడం లాంటి కొన్ని మచ్చలను కలిగిన నరేంద్రుడు నేటికీ ప్రజల ప్రధానిగా అపూర్వ ఆదరణ పొందడం విశేషం. అత్యంత ప్రజాధరణ పొందిన నేతగా ప్రజల నమ్మకాన్ని చూరగొన్న 'మోదీ ఫాక్టర్' ఆలోచనల అమ్ములపొది లోంచి మరిన్ని ప్రజాహిత పథకాలు సామాన్యులకు అందాలని ఆశిద్దాం. మానవ ప్రతిన ముందు సంక్షోభాలు అల్పమని, మనకు అందివచ్చిన అవకాశాలే మన ప్రగతిని నిర్ణయిస్తాయని నమ్మిన నరేంద్ర మోదీ భవ్య ఆశయాలు సాకారం కావడానికి స్వయాన కాశీ విశ్వనాథుడే దీవెనలు అందిస్తాడని నమ్ముదాం.

జై హింద్ ; జై కాశీనాథ్ ; జై శ్రీరామ్.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## బీహార్‌లోని కర్మాగారంలో బాయిలర్ పేలి ప్రాణనష్టం వాటిల్లడంపై ప్రధాని తీవ్ర సంతాపం

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:“”బీహార్‌లోని ముజఫర్‌పూర్‌గల కర్మాగారంలో దుర్ఘటన సంభవించడం చాలా బాధాకరం. ఈ ఉదంతంలో మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నాను. అలాగే ఈ సంఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని దైవాన్ని ప్రార్థిస్తున్నాను” అని ప్రధాని పేర్కొన్నారు.

కాగా, బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లోగల ఓ కర్మాగారంలో బాయిలర్ పేలుడువల్ల మరణించినవారి కుటుంబాలకు 'ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి' (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి నష్టపరిహారం మంజూరుకు ప్రధాని ఆమోదముద్ర వేశారు. ప్రధానమంత్రి కార్యాలయం ఈ విషయాన్ని ఒక ట్వీట్‌ద్వారా తెలిపింది. ఈ మేరకు...

“ముజఫర్‌పూర్‌లోని కర్మాగారంలో సంభవించిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు 'పీఎంఎన్ఆర్ఎఫ్' నుంచి తలా రూ.2 లక్షల వంతున నష్టపరిహారం అందించేందుకు ప్రధానమంత్రి ఆమోదించారు. అలాగే గాయపడిన వారికి తలా రూ.50,000 వంతున అందజేయబడుతుంది” అని పేర్కొంది.

## పర్యాటక రంగ సేవలకు గాను రుణ హామీ పథకం కింద చెక్కులు, మంజూరు పత్రాలు అందజేసిన - కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:రుణ హామీ పథకం కింద రుణాలు మంజూరైన కోవిడ్ ప్రభావిత పర్యాటక రంగ సేవలకు (ఎల్.జి.ఎస్.సి.ఏ.టి.ఎస్.ఎస్) చెందిన భాగస్వాములకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, డి.ఓ.ఎన్.ఈ.ఆర్. శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి చెక్కులు, మంజూరు పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా, దక్షిణ ప్రాంత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆదివారం, హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో, కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేవాలయాల పట్టణమైన భద్రాచలంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామనీ, అది 'రామాయణ సర్క్యూట్' లో చివరి కేంద్రమని, తెలియజేశారు. పర్యాటక రంగ అభివృద్ధి పై ఒక ముసాయిదా విధానాన్ని రూపొందిస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.

కోవిడ్ -19 మహమ్మారి వల్ల అత్యంత ప్రతికూలంగా ప్రభావితమైన సేవా రంగాలలో పర్యాటక రంగం ఒకటని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పర్యాటక పరిశ్రమకు సంబంధించిన భాగస్వాముల జీవనోపాధిపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపింది. “భాగస్వాముల వ్యాపారాలు, జీవనోపాధిని పునరుద్ధరించడానికి సహాయపడి, వారి కష్టాలను తగ్గించడానికి, రుణ హామీ పథకం కింద రాయితీ ధరలతో రుణ రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయించారు.” అని ఆయన చెప్పారు. ఈ పథకం కింద, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లు, పర్యాటక రవాణా నిర్వాహకులు, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన స్థానిక గైడ్ లతో పాటు, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన ప్రాంతీయ స్థాయి టూరిస్ట్ గైడ్ లు ప్రధానంగా లబ్దిపొందనున్నారు.

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ దక్షిణ ప్రాంత కార్యాలయం గుర్తించిన దాదాపు 32 మంది ఎల్.జి.ఎస్.సి.ఏ.టి.ఎస్.ఎస్. దరఖాస్తుదారులు, ఈ రోజు నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో, రుణ హామీ పథకం కింద చెక్కులు, మంజూరు పత్రాలు స్వీకరించారు.

ఈ పథకం కింద, పర్యాటక మంత్రిత్వ శాఖ ఆమోదించిన ప్రతి దరఖాస్తుదారునికి 10 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతోంది. అదే విధంగా, పర్యాటక మంత్రిత్వ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ప్రతి ప్రాంతీయ టూరిస్ట్ గైడ్ కు, రాష్ట్ర ప్రభుత్వం / కేంద్రపాలిత ప్రాంతం గుర్తించిన ప్రతి టూరిస్ట్ గైడ్ కు ఒక లక్ష రూపాయలవరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో పర్యాటక మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, దక్షిణ భారత రాష్ట్రాల పర్యాటక శాఖల సీనియర్ అధికారులతో పాటు, పర్యాటక పరిశ్రమ లోని వివిధ విభాగాల భాగస్వాములు పాల్గొన్నారు.

## ఒమిక్రాన్ ఎఫెక్ట్.. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు వాయిదా పడే చాన్స్?

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:దేశంలో కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. లేటెస్ట్ వేరియంట్ ఒమిక్రాన్ కేసులు రోజు రోజుకూ విపరీతంగా నమోదవుతున్నాయి. దీంతో 2022లో జరగబోయే పలు రాష్ట్రాల ఎన్నికలను వాయిదా వేయనున్నట్టు సమాచారం. దీనిపై ఎలక్షన్ కమిషన్ త్వరలోనే తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.

కాగా ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీలకు 2002లో ఎన్నికలు జరుగుతాయాన్న అంచనాలతో ఇప్పటికే పలు పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. తమ కేడర్‌ని బలోపేతం చేసుకునేలా పలు రకాల ప్రచార కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నాయి. అయితే.. ఎన్నికలు వాయిదా పడుతాయన్న వార్తలతో చాలామంది లీడర్లు నిరాశకు గురవుతున్నారు.

## పరవాడలో గ్యాస్ ట్యాంకర్ బోల్తా..

అమరావతి, డిసెంబర్ 27:విశాఖ జిల్లా పరవాడ ఫార్మా సిటీలో గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో ఫార్మా సిటీ యాజమాన్యం, కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. గ్యాస్ ట్యాంకర్ ను భారీ క్రేన్ సాయంతో తీసే ప్రయత్నం చేశారు. ప్రమాదం జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని ట్యాంకర్‌ను వెలికితీసేందుకు ప్రయత్నించారు. ట్యాంకర్ బోల్తా పడిన ప్రాంతంలో విద్యుత్ సరాఫరా నిలిపివేశారు.

## కేంద్ర రక్షణశాఖ మంత్రి శ్రీ అజయ్ భట్ రాణిఖేత్‌లోని కేఆర్‌సి వార్ మెమోరియల్ వద్ద అమరవీరులకు నివాళులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కేంద్ర రక్షణ మరియు పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్ డిసెంబర్ 27, 2021న ఉత్తరాఖండ్‌లోని రాణిఖేట్ కుమావోన్ రెజిమెంటల్ సెంటర్ (కేఆర్‌సి) వార్ మెమోరియల్ వద్ద అమర వీరులకు నివాళులు అర్పించారు. అలాగే వీర నారీలను కూడా సత్కరించారు. వారిని శ్రీ అజయ్ భట్ భార్య శ్రీమతి పుష్పా భట్ సత్కరించారు.

ఈ దంపతులు 1976 నుండి కేఆర్‌సి వీర్ నారీస్ నిర్వహిస్తున్న పునరావాస ప్రాజెక్ట్ అయిన కేఆర్‌సి వూలెన్స్‌ను కూడా సందర్శించారు. రక్షణ శాఖ సహాయమంత్రి 26 డిసెంబర్ 2021 నుండి ప్రారంభమైన విజయ్ సంకల్ప్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్‌లో అధికారిక పర్యటనలో ఉన్నారు.

శ్రీ అజయ్ భట్ మాట్లాడుతూ సైనికుల కుటుంబాల అత్యున్నత త్యాగం ఎల్లప్పుడూ యుద్ధాలను గెలవడానికి మరియు దేశం యొక్క భద్రతకు హామీ ఇచ్చిందని అన్నారు. మన వీర సైనికులు చేసిన అత్యున్నత త్యాగాలకు దేశం మొత్తం రుణపడి ఉంటుందని, వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వం



అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. కుమావోన్ రెజిమెంట్ సెంటర్ డిప్యూటీ కమాండెంట్ కల్నల్ సంజయ్ కుమార్ యాదవ్ కూడా రాణిఖేట్‌లోని కేఆర్‌సి వార్ మెమోరియల్ వద్ద నివాళి అర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విధుల నిర్వహణ, కుటుంబ బాధ్యతల మధ్య సరైన సమన్వయం ఉండాలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కుటుంబ జీవితానికి, వృత్తి ఉద్యోగాల్లో విధుల నిర్వహణకు మధ్య సరైన సమన్వయంతో పాటు, ఈ రెండింటికీ సమానమైన ప్రాధాన్యతను అందించే విధంగా జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. అప్పుడే పరిపూర్ణమైన జీవితాన్ని గడిపేందుకు, భవిష్యత్ లో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేందుకు వీలవుతుందన్నారు.

సోమవారం చెన్నైలో 'డాక్టర్ వి.ఎల్. దత్ - గ్లింప్సెస్ ఆఫ్ ఎ పయనీర్స్ లైఫ్ జర్నీ' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, కార్యక్రమానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, యువకులు, వివిధ రంగాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ దగ్గర పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబ జీవితం, విధుల నిర్వహణను సమన్వయం చేసుకోవడాన్ని ప్రోత్సహించేటటువంటి విధివిధానాలను రూపొందించాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. తద్వారా ఉద్యోగులు మరింత సామర్థ్యంతో, సమన్వయంతో పనిచేయడంతోపాటు, సమాజం ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు కూడా వీలవుతుందని పేర్కొన్నారు.

ఈ దిశగా కృషి చేసిన పారిశ్రామికవేత్త దివంగత శ్రీ వి.ఎల్. దత్ గారి జీవితం నుంచి ఇలాంటి అనేక ఆదర్శాలను అర్థం చేసుకుని ముందుకు సాగాలని ఉపరాష్ట్రపతి దిశానిర్దేశం చేశారు. కుటుంబాన్ని, విధులను వారు చక్కటి సమన్వయంతో నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన ఆయన శ్రీ దత్ గారు ప్రజల మనిషి అని ప్రశంసించారు. పనిచేసే చోట ప్రతి ఒక్కరికీ సమానమైన ప్రాధాన్యత ఇచ్చేవారని, కుటుంబంతోనూ ఇదే తీరుగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. నేటి వ్యాపార వాతావరణంలో అన్నింటికీ సమానమైన ప్రాధాన్యత ఇవ్వడం లోపించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

స్థాయితో, హోదాలతో సంబంధం లేకుండా, ఎలాంటి అంతరాల్లేకుండా అందరినీ ఒకేలా పలకరించే శ్రీ దత్ గారి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి, ఈ పుస్తకంలో తన భర్త గురించి శ్రీమతి ఇందిరా దత్.. తన జ్ఞాపకాలను, అనుభవాలను మనసుకు హత్తుకునేలా చక్కగా వివరించారన్నారు. ఈ పుస్తకం ఓ మంచి వ్యాపారవేత్త జీవితంలోని మానవత్వపు కోణాన్ని ఆవిష్కరిస్తుందని, ప్రతి పాఠకుడు తనను తాను ఈ పాత్రలో అన్వయించుకునేంత అర్థవంతంగా రాశారని ఆయన ప్రశంసించారు.

ఒక ఉన్నతమైన, ధనవంతుల కుటుంబంలో పుట్టిన శ్రీ దత్ గారి నిరాడంబర మనస్తత్వాన్ని గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి, ఓ గొప్ప కార్పొరేట్ లీడర్ గా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంప్రాదించుకున్నప్పటికీ తనకంటే పెద్దవారిని గౌరవించే విషయంలో ఆయన సంకోచించేవారు కాదన్నారు. నేటి యువతరం శ్రీ వీఎల్ దత్ గారి జీవితం నుంచి ప్రేరణ పొందాలని సూచించారు.

ఉమ్మడికుటుంబ వ్యవస్థ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటిందన్న ఉపరాష్ట్రపతి, విదేశాల్లోనూ మన కుటుంబ వ్యవస్థపై ఎంతో గౌరవం ఉందన్నారు. నేటి సమాజంలో వివిధ కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమౌతున్న నేపథ్యంలో, పరస్పర సంరక్షణ, కుటుంబంలో ఒకరి గురించి మరొకరు ఆలోచించే పరిస్థితులు, సంయుక్త నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు రోజు రోజుకూ తగ్గిపోతుండడం పట్ల విచారం వ్యక్తం చేశారు. యువత ఉమ్మడి కుటుంబ వ్యవస్థను పునరుద్ధరించే దిశగా ఆలోచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ వి.ఎల్. దత్ గారితో తమ వ్యక్తిగత అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, తమ ఇద్దరి మధ్య క్రీడలు మొదలుకుని ఎన్నో విషయాల్లో ఏకాభిప్రాయం ఉండేదన్నారు. క్రీడల పట్ల అమితాసక్తి కనబరిచే ఆయన, జీవితాన్ని ఎంతో ఉత్సాహంగా గడిపిన విషయాన్ని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో క్రీడలను, ఇతర శారీరక వ్యాయామాలను యువత తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి దిశానిర్దేశం చేశారు.

శ్రీ దత్ గారు పారిశ్రామికవేత్తగా, సామాజికవేత్తగా, సామాజికాభివృద్ధిలో, దేశాభివృద్ధిలో దూరదృష్టి కలిగిన వ్యక్తిగా తమదైన ప్రత్యేకతను సంపాదించుకున్నారన్న ఉపరాష్ట్రపతి, వారి జీవితమంతా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూనే ఉన్నారన్నారు. ఫిక్కీ అధ్యక్షుడిగా ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే విషయంలో 1991-92 సమయంలో శ్రీ దత్ గారు కీలకమైన పాత్ర పోషించిన విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు.

సమాజం నుంచి ఏమీ ఆశించకుండా, ఎలాంటి షరతుల్లేకుండా తాను అనుకున్న దాన్ని ఇవ్వడం శ్రీ దత్ గారి నైజమన్న ఉపరాష్ట్రపతి, వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజికాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. కళాశాలల నిర్మాణానికి, నైపుణ్యాభివృద్ధికి, వైద్యవసతుల కల్పనకు తనవంతు సహాయాన్ని అందించారని పేర్కొన్నారు.

వ్యాపారవేత్తగానే గాక, వ్యక్తిగా ఉన్నతమైన జీవన విధానాన్ని గడిపిన శ్రీ దత్ గారి జీవితాన్ని పుస్తకరూపంలో అందుబాటులోకి తీసుకొచ్చిన, ఆయన సతీమణి శ్రీమతి వి.ఎల్. ఇందిరాదత్ గారిని, వారి ఆలోచనలకు చక్కటి అక్షరరూపాన్ని అందించిన శ్రీ యు. ఆత్రేయ శర్మ గారిని, కుమారి అంబికా అనంత్ గారిని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అభినందించారు.

## కేరళలో నాలుగు రోజుల్లో 215 కోట్ల మద్యం అమ్మకాలు..

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా కేరళలో మద్యం అమ్మకాలు రికార్డు కొట్టాయి. మునుపెన్నడూ లేని రీతిలో దాదాపు రూ. 215 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్టు అధికారులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా కేవలం నాలుగు రోజుల్లో కేరళ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఃఇఎఉా) అవుట్‌లెట్‌లు, కన్స్యూమర్‌ఫెడ్ అవుట్‌లెట్‌ల ద్వారా అమ్మకాలు జోరుగా సాగాయి. క్రిస్మస్ పండుగ రోజున రాష్ట్రంలో ఒక్క బీఈవో ఔట్‌లెట్ల నుంచే రూ.65 కోట్ల మద్యం తాగారు.

రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలోని పవర్ హౌస్ అవుట్‌లెట్ ఆ రోజు అత్యధికంగా మద్యం విక్రయించి రూ.73 లక్షల విక్రయాలను నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంలో రాష్ట్రంలో రూ.55 కోట్ల విక్రయాలు జరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ఃఇఎఉా, కన్స్యూమర్-ఫెడ్ అవుట్‌లెట్‌ల ద్వారా అమ్మకాలు భారీగా జరిగాయి. పవర్ హౌస్ అవుట్‌లెట్ దుకాణంలో అత్యధికంగా రూ.73.54 లక్షల మద్యం అమ్మకాలు జరిగాయి..

కేరళలోని చాలక్కుడిలో అత్యధికంగా రూ.70.7 లక్షల మద్యం అమ్మకాలు జరిగాయి. 60 లక్షల మద్యం విక్రయించిన ఇరింజలక్కుడ ఔట్‌లెట్ మూడో స్థానంలో నిలిచింది. గతేడాది కూడా ఇదే మూడు ఔట్‌లెట్లు టాప్ ప్లేసులో నిలిచాయి. కన్స్యూమర్ ఫెడ్ అవుట్‌లెట్‌లలో, కొడంగల్లూర్ రూ. 54 లక్షల అమ్మకాలతో అగ్రస్థానంలో ఉండగా, బెనర్జీ రోడ్, కొచ్చిలోని ఔట్‌లెట్ రూ. 53 లక్షల విలువైన మద్యం విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.

## హిమపాతంలో చిక్కుకున్న 150 మంది టూరిస్టులు.. రెస్క్యూ చేసి కాపాడిన పోలీసులు..



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఉత్తరాదిని చలిగాలు వణికిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో భారీగా మంచు కురుస్తోంది. ఆదివారం రాత్రి ప్రశార్ సరస్సు వద్ద హిమపాతంలో చిక్కుకుపోయిన 40 వెహికల్స్, 150 మంది టూరిస్టులను హిమాచల్ ప్రదేశ్ పోలీసులు కాపాడారు. దాదాపు 12 గంటలపాటు రెస్క్యూ చేసి వారిని కాపాడినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

దీనిపై మండి జిల్లా ఎస్పీ షాలిని అగ్నిహోత్రి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ ప్రాంతంలో మంచు కారణంగా టూరిస్టులు చిక్కుకుపోయారని, ప్రశార్ సరస్సు వద్ద 40 వాహనాలు, సుమారు 150 మంది వ్యక్తులను పోలీసులు రక్షించారని తెలిపారు. గత రాత్రి 12 గంటల ఆపరేషన్ తర్వాత వారిని సురక్షితంగా తీసుకొచ్చామని ఎస్పీ తెలిపారు.

## పల్లె దవాఖానాల్లో ఆధునిక వైద్యసేవలు..

హైదరాబాద్, డిసెంబర్ 27:ఇప్పటి వరకు పల్లెల్లో అందుతున్న సర్కారీ వైద్యంలో పల్లె దవాఖానాలు విప్లవాత్మక మైన మార్పు తేనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 4830 పల్లె దవాఖానాల ఏర్పాటు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఐదు వేల జనాభా ఉన్న ప్రతి ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను పల్లె దవాఖానాగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీల్లో హెల్త్ వర్కర్, ఆశాలు, ఏఎన్ఎంల ద్వారానే వైద్య సేవలు అందుతున్నాయి. ఇక మీదట పల్లె దవాఖానాలుగా రూపుదిద్దుకోనున్న పీహెచ్‌సీ ల్లో ఎంబీబీఎస్ వైద్యుల సేవలు 24 గంటలూ అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు పట్టణాల్లోని ప్రయివేటు ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలు పేద ప్రజలకు ఇక పల్లెల్లోనే ఉచితంగా అందనున్నాయి.

ప్రతి పల్లె దవాఖానాలో 17 మంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. వీరిలో ఒక మెడికల్ ఆఫీసర్ (ఎంబీ బీఎస్) పూర్తి సమయం, మరో మెడికల్ ఆఫీసర్ పార్ట్ టైమ్, ఇద్దరు ఫార్మాసిస్టులు, ఏఎన్ఎంలు, హెల్త్ వర్కర్లు ఐదుగురు, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ మేనేజర్ ఒక్కరేసి చొప్పున, అకౌంటెంట్‌తో కలిపి ముగ్గురు సహాయకులు విధుల్లో ఉంటారు. పల్లె దవాఖానాల్లో గర్భిణులు, నవజాత శిశువులకు పక్కా వైద్యం, చిన్నారులు, యువతకు అన్ని రకాల వైద్య సేవలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఇతర సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమం కింద సంక్రమిత వ్యాధుల కట్టడి (విష జ్వరాలు, వైరస్‌ల నియంత్రణ తదితర) ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ సేవలతో కలిపి అందనున్నాయి. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, కిడ్నీ తదితర వైద్య సేవలు, టీబీ, కుష్టు వ్యాధికి చికిత్స ఇక పల్లెల్లోనే అందనుంది. గొంతు, చెవి, ముక్కు సమస్యలకు కూడా పల్లె దవాఖానాలే చికి త్స చేయనున్నాయి. 24 గంటలపాటు అత్యవసర వైద్య సేవలు అందుతాయి. మానిసక వ్యాధులకు కూడా పల్లె దవాఖానాల్లో చికిత్స అందించనున్నారు.

## 317 జీవోతో ఆదివాసీలకు అన్యాయం

వరంగల్, డిసెంబర్ 27:తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలు, జీవోలకు విరుద్ధంగా మల్టిజోనల్ వ్యవస్థ 317 జీవోను ప్రవేశ పెట్టిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నేతలు అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర అని వారు ఆరోపించారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంత బంద్ ను కొనసాగించారు. ఈ బంద్ లో భాగంగా న్యూడేమోక్రసి,వ్యాపార, వాణిజ్య, వర్తక వ్యాపారులు సంపూర్ణ మద్దతు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమతి నాయకులు మాట్లాడారు. విద్యా, ఉద్యోగాల్లో ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాలు లేకుండా చేసి ఆదివాసీల ప్రత్యేకతను దిగజార్చరని మండిపడ్డారు. తెలంగాణాలో షెడ్యూల్డ్ ప్రాంతాన్ని జిల్లాల విభజన పేరుతో వేరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మనోభావాలను దెబ్బ తీస్తున్న ప్రభుత్వం పైన ఆదివాసీలు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# ఒమిక్రాన్ కు ఆనందయ్య మందు.. పంపిణీని అడ్డుకున్న గ్రామస్తులు



అమరావతి, డిసెంబర్ 27:కరోనా సెకండ్ వేవ్ సమయంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఆనందయ్య మందుకు భారీగా డిమాండ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆనందయ్య మందుకు కోసం ఆయన ఇంటి ముందు పడిగాపులు కాశారు. ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా బాధితులు నెల్లూరుకు క్యూ కట్టారు. కరోనాకు మందు తయారు చేసి దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఆయుర్వేద నిపుణుడు ఆనందయ్య.. ఇప్పుడు ఒమిక్రాన్ కు కూడా మందును తయారు చేశారు.

రాష్ట్రంలో ఇప్పటికే ఆరు ఒమిక్రాన్ కేసులు నమోదైయ్యాయి. ఈ నేపథ్యంలో ఆనందయ్య మందు కోసం మరోసారి డిమాండ్ ఏర్పడింది. ఒమిక్రాన్ కు తన వద్ద మందు ఉందని, 48 గంటల్లో వ్యాధిని తగ్గిస్తానంటూ ఇటీవల ఆనందయ్య సంచలన స్టేట్ మెంట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆనందయ్య ఇంటికి ప్రజలు బారులు తీరుతున్నారు. మందు పంపిణీ కూడా మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఆనందయ్య మందు పంపిణీని గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా.. ఎలాంటి లైసెన్సు లేకుండా ఎలా మందు పంపిణీ చేస్తారంటూ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ప్రశ్నించారు. ఆనందయ్య వల్ల గ్రామాల్లో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిన్న పిల్లలు అనారోగ్యానికి గురై హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నారని, గ్రామంలోకి బయటి వ్యక్తుల రాక వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనందయ్య మందు పంపిణీ ఆపాల్సిందేనని పట్టుబడుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో ఆనందయ్య ముందే పంచాయతీల ఏర్పాటు చేసిన గ్రామస్థులు.. మందు పంపిణీకి అనుమతి ఉంది అంటూ ప్రశ్నించారు.

కాగా, ఒమిక్రాన్ సోకకుండా సుమారు 22 రకాల దినుసులతో ఐదు రకాల మందులు తయారు చేసినట్టు ఇటీవల ఆనందయ్య ప్రకటించారు. ఈ మందును ఒకే రోజు రెండు పూటలా తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. తన మందుల తయారీకి కోర్టుల అనుమతి కూడా ఉందని చెప్పారు. ఒమిక్రాన్ సోకిన వారు మందు కోసం తనను సంప్రదించవచ్చని ఆనందయ్య తెలిపారు. ప్రస్తుతం ఈ మందును బంధువులు, మిత్రుల ద్వారా ఒమిక్రాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న యూకే, యూఎస్ఏ తదితర దేశాలకు ఎక్కువగా పంపిస్తున్నామని చెప్పారు. ఈ మందును ఏడాది పాటు నిల్వ ఉంచుకోవచ్చని తెలిపారు. మందు తీసుకునే వారు 15 రోజుల పాటు మాంసాహారం, మద్యం తీసుకోకూడదని చెప్పారు.

# రంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఆగి ఉన్న కారును లారీ ఢీ

హైదరాబాద్, డిసెంబర్ 27: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓఆర్ఆర్ నుంచి కోహెడ వెళ్లే దారిలో ముందు వెళుతున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో ఆగి ఉన్న కారును వెనక నుంచి మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మొత్తం అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.

క్షతగాత్రులను ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. అయితే మంచు ఎక్కువ ఉండటం కారణంగా వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అదిరిపోయిన బ్రిటన్ ఎలక్ట్రిక్ స్కూటర్.. హెడ్ ఆఫీస్ మన హైదరాబాద్‌లోనే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:యూకేకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ వన్ మోటో గ్లోబల్ భారత మార్కెట్లలోకి మరో హైస్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఎలెక్టాను లాంచ్ చేసింది. గత నెలలో రెండు ఎలక్ట్రిక్ స్కూటర్ల(బైకా, కామ్యూటా) మోడల్స్‌ను లాంచ్ చేసిన వన్ మోటో తాజాగా తన ప్రీమియం ఎలక్ట్రిక్ స్కూటర్ ఎలెక్టాను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ స్కూటర్ ధర రూ.2 లక్షలు(ఎక్స్ షోరూమ్)గా ఉంది.

గత రెండు మోడల్స్‌తో దీని ధర ఎక్కువగానే ఉన్న ఫీచర్స్ వాటి కంటే చాలా బాగున్నాయి. ఈ బైక్స్ బుకింగ్స్ నేటి నుంచి ప్రారంభంకానున్నాయి.

జియో ఫెన్సింగ్, ఐవోటి, బ్లూటూత్, ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీ, మొబిలిటీ ట్రాకింగ్, బ్యాటరీ స్వాప్ అప్షన్స్‌తో రానున్నాయి. వన్ మోటో గ్లోబల్ ఇండియాలో అధికారికంగా హైదరాబాద్‌లో తమ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇది 72వోల్ట్, 45 అంపియర్ గల డిటాచబుల్ లిథియం-అయాన్ బ్యాటరీతో వస్తుంది. ఈ స్కూటర్ ఫుల్ ఛార్జ్ చేయడానిక్ నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ స్కూటర్‌ను ఒకసారి ఫుల్ ఛార్జ్ చేస్తే 150 కిలోమీటర్లు వెళ్ళే సామర్థ్యం కలిగిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ గంటకు 100 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది.


సుగుణ సాహితి సమితి సిద్దిపేట

సిద్దిపేట జిల్లా స్థాయి ఉగాది బాలల కథల పోటీ - 2021

(ఆచార్య మర్పడగ చెన్నకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి సౌజన్యంతో)

బాలలలో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి, వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్దిపేట జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు గత సంవత్సరం కథల పోటీ నిర్వహించి బహుమతులు ప్రదానము చేసినాము. ప్రస్తుతము కూడా సిద్దిపేట జిల్లాలో చదువుచున్న పాఠశాలల విద్యార్థుల నుండి ఉగాది బాలల కథల పోటీ కి కథలను ఆహ్వానిస్తున్నాము.

బహుమతుల వివరాలు :

ప్రథమ బహుమతి : 1500/-

ద్వితీయ బహుమతి : 1000/-

తృతీయ బహుమతి (2) : 500/-

9 ప్రోత్సాహక బహుమతులు - ఒక్కొక్కటి : 300/-

నియమ నిబంధనలు :

- కథలు ఆహ్లాదాన్ని కలిగిస్తూ, ఆలోచనలను రేకెత్తించే విధంగానూ, బంధాలు, కరుణ, దయ కలిగిఉండేలా, కథలు మన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. నీతిని బోధించేలా ఉండాలి.
- కథల నిడివి చేతివ్రాతలో మూడు పేజీలు, డి.టి.పి.లో రెండు పేజీలు మించరాదు.
- పోటీకి పంపించే కథలు ఇదివరలో ఏ పత్రికలోనూ ప్రచురణ కానివి, వాట్సప్ / బ్లాగులలో పరిశీలనలో లేనివి, కథ తమ స్వంతమేనని హామీ పత్రం తప్పనిసరిగా జతపరచాలి. హామీ పత్రంపై ప్రధానోపాధ్యాయులు / ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రుల సంతకం ఉండవలెను.
- కథల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.
- కథలను స్వయంగా కాని, రిజిష్టర్ పోస్టు ద్వారా గాని, కొరియర్ ద్వారా గాని మాత్రమే స్వీకరిస్తారు.
- మార్చి 2021 చివరి వారం / ఏప్రిల్ మొదటి వారంలో బహుమతుల ప్రదానం జరుగును.
- కథలు పంపాల్సిన చివరి తేది. 10 ఫిబ్రవరి, 2021.

కథలు పంపాల్సిన చిరునామా : కన్వీనర్, ఉగాది బాలల కథల పోటీ ప్రతిభ డిగ్రీ కళాశాల, సిద్దిపేట - 502 103. సెల్ : 9959007914

అధ్యక్షులు : మొసర్ల మాధవరెడ్డి, సుగుణ సాహితి సమితి

కన్వీనర్ : భైతి దుర్గయ్య, సుగుణ సాహితి సమితి


# టీఆర్ఎస్‌కు ఇంకో ఛాన్స్ లేదు



న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ముఖ్యమంత్రి కేసీఆర్ పై హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రంగా ఫైర్ అయ్యారు. బీజేపీ తలపెట్టిన నిరుద్యోగ దీక్షలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మాదిరి కేసీఆర్ కోసం త్యాగాలు చేసేవారు తెలంగాణ గడ్డ మీద లేరని అన్నారు. ఒక్కసారి కుప్పకూలితే టీఆర్ఎస్ పార్టీ మరొకసారి అధికారంలోకి వచ్చే ఆస్కారం లేదని జోస్యం చెప్పారు. ఏడాదిలో 145రోజులు ఫాంహౌస్‌లో ఉన్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్న ఈటల.. కేసీఆర్‌ను గద్దె దించటానికి విద్యార్థులు, యువత, నిరుద్యోగులు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగుల కలలను కేసీఆర్ ప్రభుత్వం కల్లలుగా మిగిల్చిందని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఫీల్డ్ అసిస్టెంట్ల నోట్లో మట్టికొట్టిందని విమర్శించారు. నిరుద్యోగులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. 2018లో నిరుద్యోగ భృతి ఇస్తానని మ్యానిఫెస్టోలో చెప్పి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని ఈటల ఆరోపించారు.

# లక్నోలో డి.టి.టి.సి., బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ.) ఆధ్వర్యంలో, నిర్మించ తలపెట్టిన రక్షణ సాంకేతిక పరిజ్ఞాన, పరీక్షా కేంద్రానికి (డి.టి.టి.సి.కి), బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రానికి రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ డిసెంబరు 26న శంకుస్థాపన చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ సమక్షంలో రెండు కేంద్రాల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి కౌశల్ కిశోర్, ఉత్తరప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి సతీష్ మహానా,; ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు; రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు, డి.ఆర్.డి.ఒ.కు, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తాజాగా జరిగిన శంకుస్థాపనతో 22ఎకరాల విస్తీర్ణంలో లక్నోలో నిర్మించనున్న డి.టి.టి.సి. ఎన్నో రకాలుగా విలక్షణమైనది. ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక కారిడార్ (యు.పి.డి.ఐ.సి.)లో రక్షణ గగనతల తయారీ విభాగాల సమూహ ప్రగతిని మరింత వేగవంతం చేసేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ డి.టి.టి.సి. పరిధిలో ఈ కింద ఆరు ఉపకేంద్రాలు పనిచేస్తాయి.:

ఇక బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ సంస్థ ప్రకటించిన బ్రహ్మోస్ తయారీ కేంద్రం, లక్నోలోని రక్షణ పారిశ్రామిక కారిడార్ పరిధిలో ఎంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నది. 200 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండే ఈ సంస్థలో కొత్త తరహా బ్రహ్మోస్-ఎన్.జి. (తదుపరి తరం) రకం క్షిపణులను ఉత్పత్తి చేస్తారు. బ్రహ్మోస్ ఆయుధ వ్యవస్థకే ప్రత్యేకమైన ఆయుధాన్ని మోసుకెళ్లగలిగే క్షిపణులను ఈ కేంద్రంలో తయారు చేస్తారు. ఈ కేంద్రం రానున్న రెండు మూడేళ్లలో ఉత్పాదనకు సిద్ధమవుతుంది. సంవత్సరానికి 80నుంచి వంద బ్రహ్మోస్ ఎన్.జి. క్షిపణులను ఈ కేంద్రంలో తయారు చేస్తారు.

శంకుస్థాపన సందర్భంగా డి.ఆర్.డి.ఒ., బ్రహ్మోస్ ఎయిరో స్పేస్ సంస్థ శాస్త్రవేత్తలను, ఇంజనీర్లను రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ అభినందించారు. జాతీయ భద్రతను, రక్షణ ఉత్పాదనను, ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ రెండు కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషించగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ రెండు కేంద్రాల్లో ఏర్పాటు కానున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞాన సదుపాయాలు, మన రక్షణ రంగంలోనే ముఖ్యమైన మలుపుగా నిలిచిపోగలవన్నారు. ఆదాయాన్ని సమకూర్చడంతోపాటుగా, యువతకు ఉపాధి కల్పనకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలుగన్న 'ఆత్మనిర్భర భారత్' కలను సాకారం చేసుకునేందుకు ఈ కేంద్రాలు దోహదపడగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా, మేక్ ఫర్ వరల్డ్ అనే సందేశాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చేరుకున్నాయని అన్నారు.

'రక్షణ సాంకేతిక, పరీక్షా కేంద్రం (డి.టి.టి.సి.)' గురించి ఆయన ప్రస్తావిస్తూ, రక్షణ ఉత్పాదనలను రూపొందించడానికి తగిన సాంకేతిక పరిజ్ఞానానికి తగిన పునాదిని ఈ కేంద్రం ఏర్పాటు చేయగలదన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం,.. అమౌసీ ప్రాంతానికి చెందిన యువజనులైన ఆవిష్కర్తలను, స్టార్టప్ సంస్థలను దృష్టిలో పెట్టుకుని ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు కేంద్రమంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర యువత ఆశయాలను నెరవేర్చేందుకు, సృజనాత్మక శక్తిని, సామర్థ్యాలను వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేయగలదని ఆయన చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలను సమీకృతం చేసేందుకు, రక్షణ, గగనతల రంగాలకు సంబంధించిన తయారీ ప్రక్రియలో ఉత్తరప్రదేశ్‌ను ముందువరుసలో నిలిపేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా రక్షణ రంగంలో, గగనతల రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పనకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని రాజనాథ్ సింగ్ చెప్పారు.

భారతదేశ చరిత్రను ఆయన ఉటంకిస్తూ, "మనం ఎప్పుడూ ఆక్రమణదారుగా వ్యవహరించలేదు. అయితే, ఏదైనా దేశం శత్రుభావంతో వచ్చినపుడు మాత్రం ప్రజలను రక్షించుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటున్నాం." అని అన్నారు. దాడులను ఎదుర్కొని దీటుగా ప్రతిఘటించడమే బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రయిజ్ క్షిపణి వ్యవస్థ ప్రధాన ధ్యేయమని అన్నారు. బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ భారత, రష్యా దేశాల సాంకేతిక సహకారాన్ని ప్రతిబింబించడమే కాక, దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉభయదేశాల సాంస్కృతిక, రాజకీయ, దౌత్య బంధాలకు సూచికగా నిలిచిందని అన్నారు. బ్రహ్మోస్ వ్యవస్థ అనేది, ప్రపంచంలోనే ఉత్తమమైన, వేగవంతమైన, కచ్చితత్వంతో కూడిన చోదకశక్తితో కూడిన ఆయుధమని, 21వ శతాబ్దంలో ఇది భారతీయ సాయుధబలగాల ప్రతిఘటనా శక్తిని మరింత బలోపేతం చేసిందని రాజనాథ్ సింగ్ అన్నారు.

బ్రహ్మోస్ వ్యవస్థ సాయుధ బలగాలకు సాధికారతను కల్పించిందని, అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సైనిక ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసిందని రక్షణమంత్రి అన్నారు. భూ ఉపరితలంపై, నీటిలో, గగనతలంలో ఇప్పటికే తన శక్తి సామర్థ్యాలను రుజువు చేసుకున్న బ్రహ్మోస్ ఎన్.జి. క్షిపణి వ్యవస్థ,.. రానున్న కాలంలో భారతీయ సాయుధ బలగాల అధునాతన యుద్ధ పటిమను మరింతగా బలోపేతం చేయగలదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బహుముఖ సాంకేతిక పరిజ్ఞాన ప్రగతికి, ఆ ప్రాంతంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు అనువుగా ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక కారిడార్ (యు.పి. డి.ఐ.సి.) కొత్త మార్గాలను తెరిచిందని అన్నారు. "ఈ కారిడార్‌తో రూ. 3,732కోట్ల పెట్టుబడులు రావచ్చని ప్రారంభోత్సవ సమయంలో అంచనా వేశాం. ఇప్పటికే, రూ. 1,400కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. కారిడార్ ఏర్పాటు ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోంది." అని ఆయన అన్నారు.

గత కొన్నేళ్లలోనే రక్షణ సాంకేతిక పరిజ్ఞానరంగంలో భారతదేశం గౌరవనీయమైన స్థానాన్ని సాధించిందని, అధునాతన పరిజ్ఞానంతో కూడిన క్షిపణి వ్యవస్థను కూడా రూపొందించుకోగలిగిందని, రక్షణ పారిశ్రామిక పునాదుల నిర్మాణంలో ప్రశంసనీయమైన ప్రగతిని సాధించిందని ఆయన అన్నారు. సాయుధ బలగాలను బలోపేతం చేయడం, అధునాతన క్షిపణి వ్యవస్థల రూపకల్పన, ఉత్పాదనలో స్వావలంబనతో కూడిన 'ఆత్మనిర్భర భారత్' స్థాయిని సాధించడంలో డి.ఆర్.డి.ఒ. శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని కేంద్రమంత్రి అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చేందుకు ప్రతిన బూనాలని ఆహూతులందరికీ రాజనాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన రెండు కీలకమైన ప్రతిష్టాత్మక కేంద్రాలకు శంకుస్థాపన చేయడం దేశ రక్షణ రంగం, రక్షణ ఉత్పాదన రంగం, ఉత్తరప్రదేశ్ ఆర్థిక రంగంలో, లక్నో నగరాభివృద్ధిలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టేనని అన్నారు. రాష్ట్రానికి చెందిన అన్ని సామాజిక వర్గాల ప్రగతి, సంక్షేమం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అనేక చర్యలు తీసుకున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ నాయకత్వాన్ని ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యానాథ్ మాట్లాడుతూ, రక్షణ మంత్రిత్వశాఖ చొరవతో తీసుకున్న అనేక కార్యక్రమాల నేపథ్యంలో, రక్షణమంత్రి రాజనాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రక్షణమంత్రిత్వ శాఖ చొరవతో ఏర్పాటవుతున్న యు.పి. డి.ఐ.సి., రెండు కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన వంటివి రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర భారత్' సాకారం చేయడానికేనని ఆయన అన్నారు.

రక్షణమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈ రెండు కేంద్రాలు ఉత్తరప్రదేశ్ యువతకు ఉపాధి కల్పనకు, మార్గాలను ఏర్పరుస్తాయని యోగీ ఆదిత్యానాథ్ అన్నారు. రాష్ట్రం ప్రగతికి, దేశాభివృద్ధికి ఈ రెండు కేంద్రాలు గణనీయమైన సేవలందించగలవన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రక్షణ రంగం ప్రగతికి గల అవకాశాలను గురించి ఆదిత్యానాథ్ ప్రధానంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో మధ్య, సూక్ష్మ, చిన్న మధ్యతరహా (ఎం.ఎస్.ఎం.ఇ.) సంఖ్య భారీ సంఖ్యలో ఉన్నందున రక్షణ రంగం ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్రానికి రక్షణ రంగం ద్వారా వచ్చే పరిశ్రమలకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందన్నారు.

రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శి, డి.ఆర్.డి.ఒ. చైర్మన్ డాక్టర్ జి. సతీశ్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ, లక్నోలో డి.టి.టి.సి. ఏర్పాటుకోసం భూమిని అందుబాటులోకి తెచ్చినందుకు రక్షణమంత్రికి కృతజ్ఞతలు చెప్పారు. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ కేంద్రంకోసం 200 ఎకరాల స్థలాన్ని అందించినందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ ప్రాంతంలో వచ్చే అన్ని పరిశ్రమలకు డి.ఆర్.డి.ఒ.నుంచి తప్పనిసరిగా మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

ఉత్తరప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రహదారులు, పారిశ్రామికాభివృద్ధి సంస్థ (యు.పి.ఇ.ఐ.డి.ఎ.), డి.ఆర్.డి.ఒ. మధ్య, డిఇఫ్ ఎక్స్‌పో-2020 ప్రదర్శన సందర్భంగా కుదిరిన అవగాహనా ఒప్పందం అమలులో భాగంగా లక్నోలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డి.టి.టి.సి.ని ఏర్పాటు చేస్తున్నారు. రక్షణమంత్రి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సమక్షంలో ఈ అవగాహనా ఒప్పందం కుదిరింది. నమూనా రూపకల్పన, నిర్మాణం, ప్రయోగపరీక్ష, అధ్యయన పద్ధతిని డి.టి.టి.సి. అనుసరిస్తుంది. కేంద్రీకృత అధునాతన సాంకేతిక పరిజ్ఞాన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ఈ కేంద్రం తగిన వసతిని కల్పిస్తుంది. ఇది తన పరిధిలోని ఆరు ఉపకేంద్రాల ద్వారా ఉత్పాదనా ప్రక్రియ రూపకల్పనను వేగవంతం చేస్తుంది. పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీల మధ్య అనుసంధానకర్తగా పనిచేస్తుంది.

యు.పి. డి.ఐ.సి.లో,.. పరిశ్రమలను, స్టార్టప్ కంపెనీలను, విద్యా సంస్థలను సమీకృతం చేయడానికి, సులభతర వాణిజ్య నిర్వహణకు దోహదపడుతుంది. తద్వారా ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేస్తుంది.

ఇక బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రయిజ్ క్షిపణి వ్యవస్థ ప్రపంచంలోనే విజయవంతమైన క్షిపణి కార్యక్రమాల్లో ఒకటిగా పేరుగాంచింది. తన సన్నిహిత వ్యూహాత్మక మిత్రదేశమైన రష్యా భాగస్వామ్యంతో భారతదేశం ఉమ్మడిగా ఈ క్షిపణి తయారీ వ్యవస్థను చేపట్టింది. 21వ శతాబ్దంలో భారతదేశపు పటిష్టమైన ప్రతిఘటనా శక్తిగా ఇది రూపుదాల్చింది. భారత, రష్యా ఉమ్మడి సంస్థ అయిన బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ సంస్థ రూపకల్పనలో తీర్చిదిద్దిన సూపర్ బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణి క్రమంగా మనకు సర్వోత్కృష్టమైన విశేష ఆయుధంగా మారుతూ వస్తోంది. ఈ ఆయుధ వ్యవస్థ పరంపర ప్రాతిపదికగా, మరింత అధునాతన పరిజ్ఞానంతో బ్రహ్మోస్-ఎన్.జి. అనే మెరుగైన తదుపరి తరపు క్షిపణి వ్యవస్థ రూపకల్పనా ప్రక్రియను ప్రారంభించారు.

విస్తృతమైన సంఖ్యలో అధునాతన సైనిక వేదికలపై మోహరించేందుకు వీలుగా ఈ కొత్త తరహా క్షిపణిని తీర్చిదిద్దనున్నారు. భూ ఉపరితలం, సముద్ర ఉపరితలం, జలంతర్భాగం, గగనతలంలో మోహరించేందుకు వీలుగా ఈ కొత్త క్షిపణి వ్యవస్థను తయారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నూతన క్షిపణి వ్యవస్థ భారతీయ సైన్యం అధునాతన పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశాలు ఉన్నాయి.

# ఈశాన్య రాష్ట్రాలలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలు చేయాల్సిన చర్యలపై వ్యవసాయ పారిశ్రామికవేత్తలు, నిపుణులతో చర్చించిన కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:అస్సాం తో సహా ఈశాన్య రాష్ట్రాల్లో వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలు చేయాల్సిన చర్యలపై వసాయ పారిశ్రామికవేత్తలు, నిపుణులతో కేంద్ర ఆయుష్, రేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ శ్రీ సర్బానంద సోనోవాల్ ఆదివారం చర్చలు జరిపారు. వ్యవసాయ ఆధారిత వృద్ధి సాధించడానికి గల అవకాశాలను మంత్రి సమావేశంలో చర్చించారు.

ప్రస్తుతం అమలు జరుగుతున్న వ్యవసాయ విధానాలు, వీటి వల్ల కలుగుతున్న ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలను నిపుణుల బృందం మంత్రికి వివరించింది. సాంప్రదాయ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయ విధానాలకు సంబంధించిన వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. వీటివల్ల ప్రాంత సుస్థిర అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి గల అవకాశాలను చర్చించి అంచనా వేశారు. ప్రాంత పర్యావరణ, ఆర్థిక అంశాలను పరిరక్షించే విధంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సాధించేందుకు చర్యలు అమలు చేయాలని సమావేశంలో నిపుణులు స్పష్టం చేశారు. నిపుణుల బృందానికి అస్సాం వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ డాక్టర్ బిద్యుత్ దేకా నేతృత్వం వహించారు.

వివిధ అంశాలపై అభిప్రాయాలను తెలుసుకున్న మంత్రి సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయ విధానాలపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని నిపుణులను కోరారు. నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని మంత్రి తెలిపారు. అత్యున్నత స్థాయిలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నివేదిక ఉపకరించాలని మంత్రి అన్నారు. అస్సాం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నివేదికను రూపొందిస్తుంది. ఈశాన్య ప్రాంతంలో అమలు జరుగుతున్న సాంప్రదాయ వ్యవసాయ విధానాలు, సేంద్రియ విధానంలో వ్యవసాయం సాగించి విజయం వ్యవసాఅన్నారు. య పారిశ్రామికవేత్తలు అనుసరించిన విధానాలను నివేదికలో పొందుపరుస్తారు.

ఆధునిక సాంకేతిక విధానాలను అనుసరించి ఈశాన్య ప్రాంత రైతులు ప్రయోజనం పొందడానికి కృషి చేయాలని శ్రీ సోనోవాల్ అన్నారు. ఈశాన్య ప్రాంతంలో వ్యవసాయ రంగం సుస్థిర అభివృద్ధిని సాధించాలని ఆయన పేర్కొన్నారు. సమగ్ర సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు సాంప్రదాయ విధానాలకు ఆధునిక సాంకేతిక అంశాలను జోడించాలని శ్రీ సోనోవాల్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రాంత రైతుల ఆర్థిక వృద్ధి సాధించేలా వ్యవసాయ కార్యక్రమాలు సాగాలని అన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆయుష్ ఆధారిత పరిశ్రమలో భాగస్వాములు కావాలని ఆయన రైతులను కోరారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందుతారని, ఈశాన్య ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని శ్రీ సోనోవాల్ అన్నారు.

అస్సాం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎక్స్‌టర్నల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్. పికె పాఠక్, విశ్వవిద్యాలయం రిసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సైకియా, వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ కె. పాఠక్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పాఠక్, నల్బరీకి ప్రాంతానికి చెందిన సహజ రైతు జయంత్ మల్ల బుజర్బరువా, మిర్జానుంచి సేంద్రీయ రైతు బన్మాలి చౌదరి మరియు టెటెలియా ఆగ్రో ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ సాంకేతిక సలహాదారు కృష్ణ సైకియా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌పై తీర్పు రిజర్వు

అమరావతి, డిసెంబర్ 27:అక్రమాస్తుల కేసులో ఏపీ సీఎం జగన్ కు ఇచ్చిన బెయిల్ ను రద్దు చేయాలని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై తెలంగాణ హైకోర్టు నేడు విచారణ కొనసాగించింది. ఎంపీ రఘురామకృష్ణరాజు తరఫున న్యాయవాది శ్రీ వెంకటేశ్ వాదనలు వినిపించారు. సీఎం హోదాలో వైఎస్ జగన్ సాక్షులను ప్రభావితం చేస్తున్నారని, అందుకే ఆయన బెయిల్ రద్దు చేయాలని కోర్టును కోరారు. జగన్ కు నోటీసులు పంపాలని కోరారు.

అందుకు ప్రతిస్పందించిన హైకోర్టు ధర్మాసనం? బెయిల్ రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్ పై మీ వైఖరి ఏమిటి? అని సీబీఐని ప్రశ్నించింది. గతంలో జగన్ కు బెయిల్ మంజూరు చేస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించిందని, అప్పటినుంచి ఇప్పటివరకు పరిస్థితి సాధారణంగానే ఉందని సీబీఐ జవాబిచ్చింది. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ లో ఉంచుతున్నట్టు ప్రకటించింది.

# సిరిసిల్లలో మరో ముగ్గురికి ఒమిక్రాన్ నిర్ధారణ

సిరిసిల్ల , డిసెంబర్ 27:: తెలంగాణలో కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ కేసులు విజృభిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో 40పైకి కేసులు నమోదైయ్యాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో ముగ్గురికి ఒమిక్రాన్ నిర్ధరణ అయింది. దుబాయి నుంచి ఇటీవల వచ్చిన వ్యక్తిలో ఒమిక్రాన్ గుర్తించారు. తాజాగా బాధితుడి భార్య, తల్లి, స్నేహితుడికి వైరస్ వ్యాప్తి చెందినట్లు పరీక్షల్లో తేలింది. ముగ్గురిని చికిత్స కోసం టిమ్స్‌కు తరలించారు. కొత్త కేసులతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒమిక్రాన్ కేసుల సంఖ్య 4కు చేరింది.

మరోవైపు ఖమ్మం జిల్లాలో తొలి ఒమిక్రాన్ కేసు నమోదైంది. కరోనా లక్షణాలతో ఈనెల 20న ఓ యువతి ఖమ్మంలో ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించుకోగా కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. యువతి నుంచి సేకరించిన నమూనాను జీనోమ్ సీక్వెన్స్ పరీక్షలు చేయగా.. పాజిటివ్‌గా తేలింది. దీంతో వైద్య అధికారులు ఆమె కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. అయితే, యువతి కరోనా టీకా రెండు డోసులు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు.

# యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న బాలకృష్ణ..



హైదరాబాద్, డిసెంబర్ 27:నందమూరి బాలకృష్ణ సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం అఖండ. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ బాక్స్ ఆఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను చిత్ర యూనిట్ దర్శించుకుంటున్నారు. ఇటీవల తిరుపతి, విజయ వాడ వెళ్లిన బాలయ్య సోమవారం యాదాద్రి నరసింహ స్వామి ని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా బాలయ్యకు దేవస్థానం అధికారులు వేదాశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాలయ్య వెంట దర్శకుడు బోయపాటి శ్రీను, దేవరకద్ర ఎమ్మెల్యే వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుతమైన దేవాలయం యాదాద్రి అని పేర్కొన్నారు.

ఇక్కడ పరిసరాలను కలుషితం చేయకుండా చేయాలని కోరారు బాలయ్య. అఖండ సినిమా సక్సెస్ లో భాగంగా తెలుగు రాష్ట్రాలల్లో అని పుణ్యక్షేత్రలను దర్శించుకున్నాం అందులో భాగంగానే యాదాద్రి దర్శనానికి వచ్చామని వెల్లడించారు. యాదాద్రి ఒక అద్భుతమని.. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరికి ఉందన్నారు నందమూరి బాలకృష్ణ.

# స్కూళ్లలో పిల్లలకు కరోనా వ్యాక్సినేషన్..సీఎం బొమ్మై

బెంగళూరు, డిసెంబర్ 27:: దేశంలో పిల్లలకు కొవిడ్ వ్యాక్సిన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారికి జనవరి 3 నుంచి వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభిస్తామని ప్రధాని మోడీ ఇటీవలే ప్రకటన చేశారు. అలాగే జనవరి 10 నుంచి ఫ్రంట్ లైన్ వర్కర్లకు, 60 ఏళ్లు పైబడి అనారోగ్య సమస్యలతో ఉన్న వృద్ధులకు వైద్యుల సలహా మేరకు అదనపు డోసు (బూస్టర్ డోసు) పంపిణీ చేస్తామని చెప్పారు.దీంతో పలు రాష్ట్రాలు ఇందుకోసం ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. దీనిపై ఈ రోజు కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మీడియాతో మాట్లాడుతూ.. జనవరి 3 నుంచి స్కూళ్లలో వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించి వ్యాక్సిన్లు వేయనున్నట్లు చెప్పారు. అలాగే, అనారోగ్య సమస్యలు ఉన్న వృద్ధులకు జనవరి 10 నుంచి అదనపు డోసు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సూచించామని ఆయన వివరించారు.

# హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

అమరావతి, డిసెంబర్ 27:హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల ఫీజులను ఖరారు చేస్తూ ఇటీవల వైసీపీ ప్రభుత్వం జీవో 53, 54లను జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు? ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల ఫీజులను మీరెలా నిర్ణయిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిబంధనలు, చట్టాలకు వ్యతిరేకంగా జీవోలు ఇచ్చారని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ స్కూలు, జూనియర్ కాలేజీ అభిప్రాయాలను తీసుకున్నాకే ఫీజులు ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవో 53, 54లను కొట్టివేసింది. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల తరపున న్యాయవాది ముతుకుమల్లి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

# రేవంత్ రెడ్డి అరెస్టును ఖండించిన అది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27(నేటినిజం ప్రతినిధి):గజ్వెల్ నియోజక వర్గం కేసీఆర్ ఫామ్ హౌస్ ఉన్న ఎర్రవెల్లి లో కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న రేవంత్ రెడ్డి సోమవారం హౌస్ అరెస్ట్ చేయడాన్ని చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు ఖండించారు. సోమవారం వేములవాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆది శ్రీనివాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను అరెస్ట్ చేయడం పనికిమాలిన చర్య, పిరికిపంద చర్య అని, ఎర్రవెల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ లో 150 ఎకరాలలో వరి పంటలు వేసిన అంశాన్ని మీడియా కు చూపిస్తానని రేవంత్ రెడ్డి వెల్లడించడం తోనే కేసీఆర్ వెన్నులో వణుకు పుట్టిందని,

అర్ధరాత్రి నుంచే రేవంత్ రెడ్డి ఇంటి ముందు పోలీసుల పహరగా ఉంటూ ఇంట్లో నుండి బయటకు వెళ్లకుండా చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ కు గొడ్డలిపెట్టు అన్నారు.

రాబోయే రోజుల్లో ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నిన రైతులను మోసం చేస్తున్నారని . ఏది ఏమైనా రైతులపక్షాన పోరాడే దమ్ము, ధైర్యం ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు.

# విలువల గురించి విడమర్చి చెబితే విమర్శలా?!

**- అల్లం నారాయణ పై అనవసరపు ఆరోపణలు చేస్తే సహించేది లేదు**

**- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27(నేటినిజం ప్రతినిధి): విలువల గురించి విడమరిచి చెబుతున్న వ్యక్తుల పై విమర్శలు చేసే వారు తన నోటిని అదుపులో పెట్టుకోవాలని టీయూడబ్ల్యూజే హెచ్ వన్ ఫోర్ త్రీ రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా హెచ్చరించారు.సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విషయానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లను తెరవిూదికి తేవడం జర్నలిజం విలువలకు విఘాతం కలిగిస్తుందని చెప్పిన ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ పై కువిమర్శలు చేయడం ఏమాత్రం సరికాదని లాయక్ పాషా అన్నారు. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులనూ, కుటుంబ సభ్యులను రచ్చకీడ్చి యాగీ చేయడాన్ని హేయమైన చర్యగా లాయక్ పాషా అభివర్ణించారు.తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అల్లం నారాయణ పై ఇక ముందు తప్పుడు ఆరోపణలు చేసినా, అనవసరపు విమర్శలకు దిగినట్లు అయితే సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు.









# డిసెంబరు 28న ప్రధాని కాన్పూర్ సందర్శన- కాన్పూర్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, డిసెంబర్ 27: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2021 డిసెంబర్ 28న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1:30 గంటలకు ఆయన కాన్పూర్ మెట్రోరైల్ ప్రాజెక్టులో ఇప్పటిదాకా పూర్తయిన భాగాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగానే 'బినా-పంకి' బహుళ ఉత్పత్తుల పైప్‌లైన్ ప్రాజెక్టును కూడా ప్రారంభిస్తారు. దీనికిముందు ఉదయం 11:00 గంటల ప్రాంతంలో ఐఐటీ-కాన్పూర్ 54వ స్నాతకోత్సవానికి ప్రధాని హాజరవుతారు.

ప్రధానమంత్రి ప్రధానంగా దృష్టి సారించిన అంశాల్లో పట్టణ రవాణాకు నూతనోత్తేజం ఇవ్వడం కూడా ఒకటి. కాన్పూర్ మెట్రోరైల్ ప్రాజెక్టులో ఇప్పటివరకూ పూర్తయిన భాగాన్ని ఆయన ప్రారంభించనుండటం ఈ దిశగా ఒక ముందడుగు. ప్రస్తుతం ఐఐటీ-కాన్పూర్ నుంచి మోతీఝీల్ వరకూ 9 కిలోమీటర్ల పొడవునగల భాగం పనులు పూర్తయ్యాయి. కాన్పూర్ మెట్రోరైల్ ప్రాజెక్టు పనులపై తనిఖీ నిమిత్తం ప్రధానమంత్రి ఐఐటీ మెట్రో స్టేషన్ నుంచి గీతానగర్ వరకూ మెట్రో రైలులో ప్రయాణిస్తారు. ఈ మెట్రోరైల్ ప్రాజెక్టు మొత్తం పొడవు 32 కిలోమీటర్లు కాగా, రూ.11,000 కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు.

బినా-పంకి బహుళ ఉత్పత్తుల పైప్‌లైన్ ప్రాజెక్టును కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. మొత్తం 356 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు సామర్థ్యం సంవత్సరానికి 3.45 మిలియన్ టన్నులుగా ఉంది. ఇది మధ్యప్రదేశ్‌లోని బినా చమురుశుద్ధి కర్మాగారం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లోగల పంకి వరకూ సాగుతుంది. దీన్ని రూ.1,500 కోట్లతో నిర్మించారు. ఈ ప్రాంతానికి బినా చమురుశుద్ధి కర్మాగారం నుంచి పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతకు ఇది దోహదపడుతుంది.

ఐఐటీ-కాన్పూర్ 54వ స్నాతకోత్సవంలో ప్రధానమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఇందులో భాగంగా బ్లాక్‌చెయిన ఆధారిత డిజిటల్ పట్టాలకు ఆయన శ్రీకారం చుడతారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ డిజిటల్ పట్టాలు ప్రదానం చేయబడతాయి. 'నేషనల్ బ్లాక్‌చెయిన్ ప్రాజెక్ట్' కింద ఐఐటీలోనే రూపొందించిన బ్లాక్‌చెయిన్ చోదిత సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ డిజిటల్ పట్టాల ప్రదానం సాగుతుంది. ఈ డిజిటల్ పట్టాలకు నకిలీల తయారీ అసాధ్యం మాత్రమేగాక ప్రపంచంలో ఎక్కడైనా వీటిని ధ్రువీకరించుకునే వీలుంటుంది.

# దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద

# మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం ప్రారంభ.

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:దీన్ దయాళ్ అంత్యోదయ యోజన- జాతీయ గ్రామీణ జీవనోపాధి (డిఏవై-ఎన్ ఆర్ ఎల్ ఎం) మిషన్, 75 సంవత్సరాల స్వాతంత్ర ఉత్సవాలైన ఆజాదికా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ప్రత్యేక ఈవెంట్‌ను 2021 డిసెంబర్ 18న వర్చువల్ విధానంలో నిర్వహించింది. గ్రామీణ ఆర్థిక సేవలు అందరికీ అందుబాటుపై చర్చను ఈ సందర్భంగా నిర్వహించింది. బ్యాంకుల ఎక్సిక్యూటివ్ డైరక్టర్లు, ఛీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, బ్యాంకుల ఇతర సీనియర్ అధికారులు,

రాష్ట్రాల గ్రామీణ జీవనోపాధి మిషన్‌లకు చెందిన ఎక్జిక్యూటివ్ అధికారులు, స్టేట్ మేనేజింగ్ డైరక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన గ్రామీణ జీవనోపాధి మిషన్ సంయుక్త కార్యదర్శి శ్రీ చరణ్‌జిత్ సింగ్ కార్యక్రమంలో పాల్గొన్నవారికి స్వాగతం పలికారు. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన గ్రామీణాభివృద్ధి విభాగ కార్యదర్శి శ్రీ నాగేంద్ర నాత్ సిన్హ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, డిఏవై-ఎన్ ఆర్ ఎల్ ఎం కింద, ప్రధానమంత్రి న్ ధన్ యోజన ఖాతాను బ్యాంకులో కలిగిన తగిన పరిశీలన చేసిన స్వయం సహాయక బృందాల సభ్యులకు 5 వేల రూపాయలు ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం కల్పించే కార్యక్రమాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ నాగేంద్ర నాథ్ సిన్హా ప్రారంభించారు. కేంద్ర ఆర్థిక మంత్రి 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా దీనిని ప్రారంభించారు. రాజస్థాన్, జార్ఖండ్ , ఉత్తర ప్రదేశ్ మూడు రాష్ట్రాలనుంచి ఒక్కో రాష్ట్రంతరపున ఆరుగు మహిళా స్వయం సహాయ బృందాల సభ్యులకు ఈ పథకం ప్రారంభ సూచనగా రూ 5000 వంతున అందజేశారరు. దీనని బ్యాంకుల సీనియర్ అధికారులు,రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల, సీనియర్ అలధికారుల సమక్షంలో ఆయా రాష్ట్రాల కేంద్ర కార్యాలయాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. డిఏవై- ఎన్ ఆర్ ఎల్ ఎం కింద 5 కోట్ల మహిళా స్వయం సహాయక సభ్యులు ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందుతారని అంచనా..

ఈ ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయాన్ని ప్రారంభించిన తర్వాత , గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణపై గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన గ్రామీణ జీవనోపాధికి చెందిన సంయుక్త కార్యదర్శి శ్రీమతి నీతా కేజ్రీవాల్ ఒక ప్రెజెంటేషన్ ను ఇచ్చారు.

మంత్రిత్వశాఖకు చెందిన వివిధ కార్యక్రమాలతో బ్యాంకులు తమ రుణ ఉత్పత్తులను అనుసంధానం చేయాల్సిందిగా ఆమె కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పరివర్తన తెచ్చేందుకు సహాయపడే దిశగా , గ్రామీణ ప్రజలకు రుణసదుపాయం అందించేందుకు తోడ్పడవలసిందిగా బ్యాంకులను కోరారు.

ఈ సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛీఫ్ జనరల్ మేనేజర్ శ్రీమతి వసుధా భట్ కుమార్ , గ్రామీణ ఆర్థజక వ్యవస్థ పునరుద్ధరణలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్రపై మాట్లాడారు. భీహార్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ జీవిక డిప్యూటీ ఛీఫ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ డి. బాలమురుగన్ , సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్సిక్యూటివ్ డైరక్టర్ శ్రీ రాజీవ్ పూరి , గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక విజ్ఞానం అందించడంలో సవాళ్లు, ఈ విషయంలో భవిష్యత్ మార్గం పై మాట్లాడారు. అస్సాం రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ రాష్ట్ర డైరక్టర్ శ్రీమతి కృష్ణ బారువా తమ ప్రసంగం సందర్భంగా , క్లిష్ట ప్రాంతాలలో ఆర్థిక తోడ్పాటు- ఈశాన్య ప్రాంతాలు అనే అంశంపై ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈశాన్య ప్రాంతంలోని గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. వివిధ బ్యాంకులు, రాష్ట్ర జీవనోపాధి మిషన్‌లకు సంబంధించిన వారు సుమారు 75 ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# రాష్ట్ర ఆరోగ్య సూచీ నాలుగో ఎడిషన్ విడుదల చేసిన నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:2019-20 రాష్ట్ర ఆరోగ్య సూచీ నాలుగో ఎడిషన్ ను నీతి ఆయోగ్ ఈ రోజు విడుదల చేసింది. "ఆరోగ్యకరమైన రాష్ట్రాలు, ప్రగతిశీల భారతదేశం" పేరుతో ఈ నివేదిక, రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు వాటి ఆరోగ్య ఫలితాలతో పాటు వాటి మొత్తం స్థితి కి సంబంధించి ఏటా పెరుగుతున్న పనితీరుపై ర్యాంక్ లు ఇస్తుంది.

రిపోర్ట్ నాల్గవ రౌండ్ 4 2018-19 నుంచి 2019-20 మధ్య కాలంలో రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాల మొత్తం పనితీరు, పెరుగుతున్న మెరుగుదలను లెక్కించడం, హైలైట్ చేయడంపై దృష్టి సారించింది.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ కుమార్, సీఈఓ అమితాబ్ కాంత్, అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేష్ సర్వాల్, ప్రపంచ బ్యాంకు సీనియర్ హెల్త్ స్పెషలిస్ట్ షీనా ఛబ్రా సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశారు. ప్రపంచ బ్యాంకు సాంకేతిక సహాయంతో, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ (ఎం.ఓ.హెచ్ ఎఫ్ డబ్ల్యు) తో సన్నిహిత సంప్రదింపులు జరిపి నీతి ఆయోగ్ ఈ నివేదికను రూపొందించింది.

రాష్ట్రాలు ,కేంద్ర పాలిత ప్రాంతాల రాష్ట్రాల పని తీరును అంచనా వేయడానికి రాష్ట్ర ఆరోగ్య సూచిక వార్షిక సాధనం. ఇది 'ఆరోగ్య ఫలితాలు', 'పరిపాలన ,సమాచారం', 'కీ ఇన్ పుట్ లు/ప్రక్రియలు' డొమైన్ ల కింద వర్గీకరించిన 24 ఇండికేటర్ ల ఆధారంగా సంకలన సమగ్ర సూచీ. ప్రతి డొమైన్‌కు ఫలితం సూచికల కోసం అధిక స్కోర్‌తో దాని ప్రాముఖ్యత ఆధారంగా బరువులు కేటాయించబడ్డాయి. ఫలితాల సూచిక ల కోసం ప్రతి డొమైన్ కు దాని ప్రాముఖ్యత ఆధారంగా అధిక స్కోరుతో విలువ ఇవ్వబడుతుంది.

పనితీరును కొలవడానికి బలమైన ,ఆమోదయోగ్యమైన యంత్రాంగాన్ని ఉపయోగిస్తారు. అంగీకరించిన సూచికలపై ఎన్ ఐ టి ఐ నిర్వహించే పోర్టల్ ద్వారా డేటా ను ఆన్ లైన్ లో సేకరిస్తారు.పారదర్శక బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేసిన స్వతంత్ర వాలిడేషన్ ఏజెన్సీ ద్వారా డేటా నుధృవికరిస్తారు. వాలిడేట్ చేసిన డేటా షీట్ లను వెరిఫికేషన్ కోసం రాష్ట్రాలకు పంచుతారు. తరువాత ఏవైనా విభేదాలు లేదా వివాదాలను పరిష్కరించడం కోసం రాష్ట్రాలతో వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తారు. ఈ విధంగా పరిష్కరించబడిన తుది షీట్లు రాష్ట్రాలతో పంచుకోబడతాయి, ఒప్పందం తరువాత, డేటా ఖరారు చేయబడుతుంది . దానిని విశ్లేషణ , నివేదిక తయారీ కోసం ఉపయోగిస్తారు.

" రాష్ట్రాలు రాష్ట్ర ఆరోగ్య సూచిక వంటి సూచీలను గ్రహించి, వాటిని తమ విధాన రూపకల్పన ,వనరుల కేటాయింపులో ఉపయోగించడం ప్రారంభించాయి. ఈ నివేదిక పోటీ ,సహకార ఫెడరలిజం రెండింటికీ ఒక ఉదాహరణ " అని విసి డాక్టర్ రాజీవ్ కుమార్ అన్నారు.'ఈ సూచిక ద్వారా మా లక్ష్యం రాష్ట్రాల చారిత్రక పనితీరును మాత్రమే కాకుండా వాటి పెరుగుతున్న పనితీరును కూడా చూడటం. ఈ ఇండెక్స్ రాష్ట్రాలు ,యుటిల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ,క్రాస్ లెర్నింగ్ ను ప్రోత్సహిస్తుంది' అని సిఇఒ అమితాబ్ కాంత్ అన్నారు.ఇండెక్స్ 2017 నుండి సంకలనం, ప్రచురణ జరుగుతోంది. ప్రచురించబడుతోంది. బలమైన ఆరోగ్య వ్యవస్థలను నిర్మించడం, సర్వీస్ డెలివరీని మెరుగుపరచడం దిశగా రాష్ట్రాలు/యుటిలను నడిపించడమే ఈ నివేదికలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.నేషనల్ హెల్త్ మిషన్ కింద ఇండెక్స్ ను ప్రోత్సాహకాలకు లింక్ చేయాలనే ఎం.ఓ.హెచ్ ఎఫ్ డబ్ల్యు నిర్ణయం ద్వారా ఈ వార్షిక సాధనం ప్రాముఖ్యతను సంతరించుకుంది. బడ్జెట్ వ్యయం ,ఇన్ పుట్ ల నుండి అవుట్ పుట్ లు ,ఫలితాల వైపు యు దృష్టిని మళ్ళించడం లో దీని పాత్ర కీలకం.

# విధుల నిర్వహణ, కుటుంబ బాధ్యతల మధ్య సరైన సమన్వయం ఉండాలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:కుటుంబ జీవితానికి, వృత్తి ఉద్యోగాల్లో విధుల నిర్వహణకు మధ్య సరైన సమన్వయంతో పాటు, ఈ రెండింటికీ సమానమైన ప్రాధాన్యతను అందించే విధంగా జీవన విధానాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అప్పుడే పరిపూర్ణమైన జీవితాన్ని గడిపేందుకు, భవిష్యత్ లో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేందుకు వీలవుతుందన్నారు.

సోమవారం చెన్నైలో 'డాక్టర్ వి.ఎల్. దత్ - గ్లింప్సెస్ ఆఫ్ ఎ పయనీర్స్ లైఫ్ జర్నీ' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి, కార్యక్రమానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, యువకులు, వివిధ రంగాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ దగ్గర పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబ జీవితం, విధుల నిర్వహణను సమన్వయం చేసుకోవడాన్ని ప్రోత్సహించేటటువంటి విధివిధానాలను రూపొందించాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. తద్వారా ఉద్యోగులు మరింత సామర్థ్యంతో, సమన్వయంతో పనిచేయడంతోపాటు, సమాజం ఎదుర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు కూడా వీలువుతుందని పేర్కొన్నారు.

ఈ దిశగా కృషి చేసిన పారిశ్రామికవేత్త దివంగత శ్రీ వి.ఎల్. దత్ గారి జీవితం నుంచి ఇలాంటి అనేక ఆదర్శాలను అర్థం చేసుకుని ముందుకు సాగాలని ఉపరాష్ట్రపతి దిశానిర్దేశం చేశారు. కుటుంబాన్ని, విధులను వారు చక్కటి సమన్వయంతో నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన ఆయన శ్రీ దత్ గారు ప్రజల మనిషి అని ప్రశంసించారు. పనిచేసే చోట ప్రతి ఒక్కరికీ సమానమైన ప్రాధాన్యత ఇచ్చేవారని, కుటుంబంతోనూ ఇదే తీరుగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. నేటి వ్యాపార వాతావరణంలో అన్నింటికీ సమానమైన ప్రాధాన్యత ఇవ్వడం లోపించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

స్థాయితో, హోదాలతో సంబంధం లేకుండా, ఎలాంటి అంతరాల్లేకుండా అందరినీ ఒకేలా పలకరించే శ్రీ దత్ గారి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి, ఈ పుస్తకంలో తన భర్త గురించి శ్రీమతి ఇందిరా దత్.. తన జ్ఞాపకాలను, అనుభవాలను మనసుకు హత్తుకునేలా చక్కగా వివరించారన్నారు. ఈ పుస్తకం ఓ మంచి వ్యాపారవేత్త జీవితంలోని మానవత్వపు కోణాన్ని ఆవిష్కరిస్తుందని, ప్రతి పాఠకుడు తనను తాను ఈ పాత్రలో అన్వయించుకునేంత అర్థవంతంగా రాశారని ఆయన ప్రశంసించారు.

ఒక ఉన్నతమైన, ధనవంతుల కుటుంబంలో పుట్టిన శ్రీ దత్ గారి నిరాడంబర మనస్తత్వాన్ని గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి, ఓ గొప్ప కార్పొరేట్ లీడర్ గా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంప్రాదించుకున్నప్పటికీ తనకంటే పెద్దవారిని గౌరవించే విషయంలో ఆయన సంకోచించేవారు కాదన్నారు. నేటి యువతరం శ్రీ వీఎల్ దత్ గారి జీవితం నుంచి ప్రేరణ పొందాలని సూచించారు.

ఉమ్మడికుటుంబ వ్యవస్థ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల ప్రత్యేకతను ప్రపంచానికి చాటిందన్న ఉపరాష్ట్రపతి, విదేశాల్లోనూ మన కుటుంబ వ్యవస్థపై ఎంతో గౌరవం ఉందన్నారు. నేటి సమాజంలో వివిధ కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమౌతున్న నేపథ్యంలో, పరస్పర సంరక్షణ, కుటుంబంలో ఒకరి గురించి మరొకరు ఆలోచించే పరిస్థితులు, సంయుక్త నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు రోజు రోజుకూ తగ్గిపోతుండడం పట్ల విచారం వ్యక్తం చేశారు. యువత ఉమ్మడి కుటుంబ వ్యవస్థను పునరుద్ధరించే దిశగా ఆలోచన చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీ వి.ఎల్. దత్ గారితో తమ వ్యక్తిగత అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్న ఉపరాష్ట్రపతి, తమ ఇద్దరి మధ్య క్రీడలు మొదలుకుని ఎన్నో విషయాల్లో ఏకాభిప్రాయం ఉండేదన్నారు. క్రీడల పట్ల అమితాసక్తి కనబరిచే ఆయన, జీవితాన్ని ఎంతో ఉత్సాహంగా గడిపిన విషయాన్ని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో క్రీడలను, ఇతర శారీరక వ్యాయామాలను యువత తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి దిశానిర్దేశం చేశారు.

శ్రీ దత్ గారు పారిశ్రామికవేత్తగా, సామాజికవేత్తగా, సామాజికాభివృద్ధిలో, దేశాభివృద్ధిలో దూరదృష్టి కలిగిన వ్యక్తిగా తమదైన ప్రత్యేకతను సంపాదించుకున్నారన్న ఉపరాష్ట్రపతి, వారి జీవితమంతా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూనే ఉన్నారన్నారు. ఫిక్కీ అధ్యక్షుడిగా ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే విషయంలో 1991-92 సమయంలో శ్రీ దత్ గారు కీలకమైన పాత్ర పోషించిన విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు.

సమాజం నుంచి ఏమీ ఆశించకుండా, ఎలాంటి షరతుల్లేకుండా తాను అనుకున్న దాన్ని ఇవ్వడం శ్రీ దత్ గారి నైజమన్న ఉపరాష్ట్రపతి, వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజికాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. కళాశాలల నిర్మాణానికి, నైపుణ్యాభివృద్ధికి, వైద్యవసతుల కల్పనకు తనవంతు సహాయాన్ని అందించారని పేర్కొన్నారు.

వ్యాపారవేత్తగానే గాక, వ్యక్తిగా ఉన్నతమైన జీవన విధానాన్ని గడిపిన శ్రీ దత్ గారి జీవితాన్ని పుస్తకరూపంలో అందుబాటులోకి తీసుకొచ్చిన, ఆయన సతీమణి శ్రీమతి వి.ఎల్. ఇందిరాదత్ గారిని, వారి ఆలోచనలకు చక్కటి అక్షరరూపాన్ని అందించిన శ్రీ యు. ఆత్రేయ శర్మ గారిని, కుమారి అంబికా అనంత్ గారిని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అభినందించారు.

# కొవిడ్-19 తాజా సమాచారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 27:దేశవ్యాప్త కొవిడ్-19 టీకా కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 141.70 కోట్ల డోసులను అందించారు.

దేశవ్యాప్త క్రియాశీల కేసుల సంఖ్య 75,841.

మొత్తం కేసుల్లో క్రియాశీల కేసులు 1% కంటే తక్కువగా, 0.22% వద్ద ఉన్నాయి. 2020 మార్చి నుంచి ఇది కనిష్ట స్థాయి.

రికవరీ రేటు 98.40% కు చేరింది. 2020 మార్చి నుంచి ఇది గరిష్ట స్థాయి.

గత 24 గంటల్లో 7,141 మంది కోలుకున్నారు. దీంతో, కోలుకున్నవారి మొత్తం సంఖ్య 3,42,37,495 కు పెరిగింది.

గత 24 గంటల్లో 6,531 కొత్త కేసులు నమోదయ్యాయి.

రోజువారీ పాజిటివిటీ రేటు (0.87%) గత 84 రోజులుగా 2% కన్నా తక్కువగా ఉంది.

వారపు పాజిటివిటీ రేటు (0.63%) గత 43 రోజులుగా 1% కన్నా తక్కువగా ఉంది.

ఇప్పటివరకు 67.29 కోట్ల కొవిడ్ పరీక్షలు చేశారు.

# త్రివిక్రమ్ మూవీ అప్డేట్‌ను పోస్ట్ చేసిన మహేష్



హైదరాబాద్, డిసెంబర్ 27:సూపర్ స్టార్ మహేష్ బాబు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో హ్యాట్రిక్ మూవీ తెరకెక్కబోతున్న సంగతి తెలిసిందే. అతడు , ఖలేజా వంటి సూపర్ హిట్ చిత్రాలు వీరిద్దరి కలయికలో వచ్చి అభిమానులను , ప్రేక్షకులను ఎంతోగానో ఆకట్టుకున్నాయి. మరోసారి వీరిద్దరి కలయికలో సినిమా అనగానే అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. వీరిద్దరి కాంబోలో హ్యాట్రిక్ మూవీ రాబోతుందని గతంలోనే ప్రకటించారు. ఆ తర్వాత ఈ కాంబో వార్త ఏది రాలేదు. ఈ తరుణంలో ఈరోజు మహేష్ ఈ మూవీ అప్డేట్ తెలిపి అభిమానుల్లో ఉత్సహం నింపారు. డైరెక్టర్ త్రివిక్రమ్, తమన్, నిర్మాత నాగవంశీతో తీసుకున్న ఫొటోను పోస్ట్ చేశారు.

మహేష్ బాబు ప్రస్తుతం దుబాయ్?లో ఫ్యామిలీతో వెకేషన్?లో ఉన్నారు. అయినా సరే కొత్త సినిమాకు సంబంధించిన అప్డేట్ తెలిపి ఆనందం నింపారు. ఇక మహేష్ ప్రస్తుత సినిమా విషయానికి వస్తే..గీత గోవిందం ఫేమ్ పరుశు రాం డైరెక్షన్లో సర్కారు వారి పాట మూవీ చేస్తున్నాడు. ఇందులో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా..థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. వాస్తవానికి ఈ మూవీ ని సంక్రాంతి బరిలో రిలీజ్ చేయాలనీ అనుకున్నారు. కానీ సంక్రాంతి బరిలో పాన్ మూవీస్ ఉండడం తో సర్కారు వారి పాట ను ఏప్రిల్ 01 న రిలీజ్ చేయబోతున్నట్లు తెలిపారు. బ్యాంక్? రుణాల ఎగవేత నేపథ్య కథాంశంతో ఈ మూవీ తెరకెక్కుతుండగా..మైత్రీమూవీమేకర్స్, జీఎంబీ ఎంటర్?టైన్?మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# పిల్లలు మెచ్చే ఒగీ అండ్ ది కాక్రోచస్, ఒబోచమ్మా-కున్ సోని ఏయ్!లో




హైదరాబాద్, డిసెంబర్ 27::ది ఈ సెలవుల సీజన్లో పిల్లలు తాము మెచ్చే టూన్స్ను చూసేందుకు, టెలివిజన్ ఆవల కూడా వారికి చేరువయ్యేందుకు ఏకైక గమ్యస్థానంగా నిలవబోతోంది సోని ఏయ్! ది సెలవుల సీజన్ మొదలైంది. పిల్లలందరూ తమ స్కూల్ బ్యాగ్స్, బుక్స్ పక్కన పడేసి సెలవులు సరదాగా గడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సెలవుల సీజన్ను నవ్వులు, వినోదంతో నింపేందుకు ప్రముఖ పిల్లల ఎంటర్టైన్మెంట్ ఛానెల్ సోనీ ఏయ్! సిద్ధమైంది. పిల్లల కోసం వారు మెచ్చేలా డబుల్ డోస్ తీసుకువచ్చింది. వారి మెచ్చిన ఒగీ అండ్ కాక్రోచస్, ఒబోచమ్మా-కున్ షోలు సోమవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1.30 గంటలకు, ఉదయం 10.30 గంటలకు చూడవచ్చు. ప్రతీ రోజు పిల్లలకు చక్కిలిగింతలు పెట్టే సరదాలు, వినోదాలు అనేకం అందిస్తోంది. ఏయ్! టూన్స్తో పాటుగా ఈ సెలవుల సీజన్ను చిన్నారులు పూర్తి సరదాగా గడపటం ఖాయం. ఇక ఆలస్యమెందుకు సోనీ ఏయ్! ట్యూన్ చేయండి. వినోదాలు, సరదాలను తనివితీరా ఆస్వాదించండి.

# ప్రాంతీయ విస్తరణలో భాగంగా తిరుపతిలో ప్రవేశించిన నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్

హైదరాబాద్, డిసెంబర్ 27: భారతదేశంలో సుప్రసిద్ధ స్టాండలోన్ ఆరోగ్య భీమా సంస్థలలో ఒకటైన నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో మ్యాక్స్‌బుపా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పరిచయం) నేడు తాము తిరుపతిలో తమ తరువాత దశ వృద్ధిలో భాగంగా కార్యకలాపాలు ప్రారంభించినట్లు వెల్లడించింది. రాబోయే ఐదేళ్లలో తిరుపతిలో 6వేల మందిని చేరుకోవాలని ఇది లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విస్తరణతో నివాబుపా రాబోయే ఐదేళ్లలో తిరుపతిలో 5 కోట్ల రూపాయల గ్రాస్ ర్రిటన్ ప్రీమియం పొందడంతో పాటుగా 13 రెట్ల అధికంగా పాలసీ కొనుగోళ్లు చేయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాదు ఈ ప్రాంతంలో ప్రజలకు వ్యాపారావకాశాలను సైతం అందిస్తూ 2025?26 నాటికి 1000 మంది ఏజెంట్లను నియమించుకోనుంది. నగరంలోని గృహిణిలకు భీమా ఏజెంట్లుగా మారే అవకాశం అందిస్తూ వారికి తగిన శిక్షణను సైతం అందించనుంది. తిరుపతిలో నివా బుపా వినియోగదారులు 42 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో క్యాష్‌లెస్ సదుపాయం పొందడంతో పాటుగా దేశవ్యాప్తంగా 7900కు పైగా హాస్పిటల్స్‌లో ఈ సౌకర్యం పొందగలరు. ఈ ప్రారంభంతో ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, కడప, అనంతపూర్‌లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తిరుపతిలో విస్తరణ ప్రణాళికలను గురించి శ్రీ అంకుర్ ఖర్బంద, డైరెక్టర్? రిటైల్ సేల్స్, నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ మాట్లాడుతూ "నివా బుపాకు అత్యంత ముఖ్యమైన మార్కెట్ ఆంధ్ర ప్రదేశ్. ఆరోగ్య భీమాను మరింత మందికి చేరువ చేసే క్రమంలో తిరుపతికి చేరువయ్యాం. ఆరోగ్య భీమా ఆవశ్యకతను గుర్తించేలా కోవిడ్?19 తోడ్పడితే, దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ సమగ్రమైన ఆరోగ్య భీమా పథకాలను అందించాలన్నది మా ప్రయత్నం" అని అన్నారు.

# హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

అమరావతి, డిసెంబర్ 27: హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల ఫీజులను ఖరారు చేస్తూ ఇటీవల వైసీపీ ప్రభుత్వం జీవో 53, 54లను జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు? ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల ఫీజులను మీరెలా నిర్ణయిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిబంధనలు, చట్టాలకు వ్యతిరేకంగా జీవోలు ఇచ్చారని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ స్కూలు, జూనియర్ కాలేజీ అభిప్రాయాలను తీసుకున్నాకే ఫీజులు ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవో 53, 54లను కొట్టివేసింది. మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల తరపున న్యాయవాది ముతుకుమల్లి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.